టూరిస్ట్ గైడ్

ఉండవల్లి

ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 28, 2004

మన పార్లమెంట్

హ్యాపీ బర్త్‌డే

(28-3-2004నుండి 3-4-2004వరకు)

భానుశ్రీ
4సం॥, 28.3.2000
భాగ్యలక్ష్మి-ప్రసాద్
ఖమ్మం

సిద్దు
3సం॥, 28.3.2001
ఇందిర-గోపి
కురుపాం-విజయనగరం

షరిహా
2సం॥, 30.3.2002
ఫలక్-అజీమ్
షాబాద్-రంగారెడ్డి

షేక్ అసూమా కిస్మత్
3సం॥, 31.3.2001
రాబియా-ఖదర్‌బాష
పీలేరు-చిత్తూరు

మురళీకృష్ణగౌడ్
8సం॥, 31.3.1996
కల్పన-మల్లేష్‌గౌడ్
అమ్దాపూర్-రంగారెడ్డి

వినీత
2సం॥, 1.4.2002
రమ-మోహన్‌రెడ్డి
మహబూబాబాద్-వరంగల్

వసుంధర
3సం॥, 1.4.2001
వరలక్ష్మి-వెంకటేష్
పెద్దవడుగురు-అనంతపురం

దీపిక
1సం॥, 2.4.2003
ఈశ్వరమ్మ-అచ్చుతరావు
రావుపల్లి

సాయి సందీప్
2సం॥, 2.4.2002
రమాదేవి-శ్రీనివాస్
అశ్వాపురం-ఖమ్మం

నవీన్‌చంద్
4సం॥, 3.4.2000
అపర్ణ-లింగరాజు
నరసరావుపేట-గుంటూరు

తరుణ్ తేజ
5సం॥, 3.4.1999
నాగవేణి-జగన్నాధరావు
బి.హెచ్.పి.వి. కాలనీ-విశాఖ

యామిని
2సం॥, 3.4.2002
కనకదుర్గ-వెంకట్రావు
గిడిజాల-విశాఖపట్నం

యాసిన్
10సం॥, మార్చి-1994
కరీమూన్-కరాముల్లా
శివరామపురం-చిత్తూరు

నిఖిత
1సం॥, మార్చి-2003
వందన-అనిల్ కుమార్
నర్సాపూర్-మెదక్

షాహిదా
మాబున్నీసా-ఖాజావలి
గిద్దలూరు-ప్రకాశం

మాబు సుభాని
మాబున్నీసా-ఖాజావలి
గిద్దలూరు-ప్రకాశం

శ్రీకళ
9సం॥, మార్చి-1995
రూపవతి-బాలరాజు
ఆదర్శనగర్-హైదరాబాద్

శిరీష
10సం॥, మార్చి-1994
ప్రభావతి-కోటేశ్వరరావు
మోదుకూరు-గుంటూరు



లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



కవర్‌స్టోరీ అద్భుతం

14-03-04లో ఆదివారం ప్రజాశక్తిలోని అమర ప్రేమకు 350 ఏళ్ళు సింప్లీ సూపర్. కవర్ డిజైన్ చాలా బాగుంది. కవర్‌స్టోరీ 'తాజ్‌మహల్‌కి 350 ఏళ్ళు'లో తాజ్‌మహల్ గురించి అనేక విషయాలు తెలుసుకున్నాను. బాలల కథ బహుమతి బాగుంది జీవన శైలి బాగుంటోంది.

అమర ప్రేమకు 350 ఏళ్ళు కవర్ స్టోరీ వ్యాసం చాలా బాగుంది. అద్భుత పాలరాతి మందిరం గురించి విలువైన సమాచారాన్ని అందించారు. భారత పర్యాటక రంగానికే తలమానికంగా వున్న ఈ శ్వేతమందిరం, ప్రపంచంలోని అన్ని దేశాల వారిని విశేషంగా ఆకర్షించి అలరిస్తోంది. అంతేకాక ప్రపంచంలోనే ఒకానొక చందర్ కట్టడంగా చెలామణి అవుతోంది. నానాటికి పెరిగిపోతున్న కాలుష్యం, పాలకులు నిర్లక్ష్యం వలన శ్వేత మందిరం మసక బారుతోంది. ఇలాగే పరిస్థితులు కొనసాగితే ఇంతటి మహత్తర చారిత్రక సంపద మన కళ్ళముందే కాంతివిహీనమై పోతుంది.

ఆగ్రాలోని తాజ్‌మహల్ అందచందాలు, 22 సంవత్సరాల కాలం పాటు తాజ్‌మహల్ కట్టిన విషయం అయిదురకాలైన అంశాలు దర్వాజా, తోటలు లేదా బగీచా, మసీదు, నక్కర్‌ఖానా లేక రెస్ట్‌హౌస్, మసోలియం గురించి సమగ్రంగా తెలుసుకోగలిగాము. ముంతాజ్ గురించి, తాజ్ కారిడార్ ప్రాజెక్టు గూర్చి తెలుసుకునే అవకాశం కలిగింది.

– పి.ఎస్.ఎస్.కిరణ్,
రామచంద్రాపురం, ప.గో.జిల్లా

– టి.శేషశయనారెడ్డి, అనంతపురం.

– కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్ జిల్లా

రియల్ స్టోరీ బాగుంది

14-03-04న ఆదివారం అనుబంధంలో గ్రామానికి లీడర్-ప్రజలకి డాక్టర్ అనే అంశం చాలా బాగుంది. ఒక డాక్టర్‌గా మీరు ప్రచురించిన రియల్‌స్టోరీ చదివి ఆనందపడ్డాను. ఇక ముందు కూడా ఇటువంటి కథల ప్రచురణ చేయగలరని కోరుతున్నాను.

– డాక్టర్ నిమ్మల సుబ్బారావు,
బువ్వనపల్లి, నిడమర్రుమండలం, ప.గో.జిల్లా.

మనలోమాట నచ్చింది

ఆదివారం అనుబంధంలో మనలో మాట పేజీలో వచ్చే వ్యాసాలు చాలా నచ్చాయి. మనిషికి సుఖం లేదంతే, 14-03-04న వచ్చిన మెదళ్ళు తింటారు జాగ్రత్త వ్యాసం చాలా బాగుంది. కార్టూన్లు ఎంతో నవ్వు తెప్పించేవిగా ఉన్నాయి. ముఖచిత్ర వ్యాసం తాజ్‌మహల్‌కు 350 ఏళ్ళు వ్యాసం చాలా నచ్చింది. బాలనేస్తాలు పేజీలో వచ్చినవి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడతాయి. పుస్తక పరిచయంలో మంచి పుస్తకాలు గురించి తెలియచేసినందుకు కృతజ్ఞతలు. కళలో వచ్చిన మానసిక వైకల్యాన్ని జయించిన చంద్రశేఖర్ జీవితం ఎంతోమందికి మార్గదర్శకంగా ఉంటుంది. ఇలా అన్ని శీర్షికలు నాకు నచ్చినవి.

– చామకూరి పుల్లయ్యగౌడ్,
నేలకొండపల్లి, ఖమ్మం

జీవనశైలి విశ్లేషణ నచ్చింది

14వ తేదీ ఆదివారం అనుబంధంలో జీవనశైలి శీర్షికన ప్రచురితమైన 'ఇంత అసమానత న్యాయమేనా' చాలా బాగుంది. మన రాష్ట్రంలోని పట్టణ పల్లె ప్రజల మధ్య గల జీవన స్థితిగతుల తారతమ్యాలను తెలియజేసింది. నేడు పట్టణాలు, పల్లెలకు మధ్య స్పష్టమైన జీవనాధీనరేఖ గీయబడి వేరుబడ్డాయి. ఈ విషయాన్ని రచయిత్రి చక్కగా విశ్లేషించారు.

– జి.ఆర్.కుర్మే, ఆదిలాబాద్.

కళాసాహితి మరింత మెరుగుపడాలి

7వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన మట్టిలో మాణిక్యాలు వెలికితీసిన తాడికొండ బాగుంది. అయితే మట్టి మాణిక్యాలు ఇంకా చక్కగా మలచవచ్చు. కళాసాహితీ తన ఆలోచనలకు మరింత పదును పెట్టినట్లయితే కళాసాహితి హృద్యంగా తయారయ్యేది. ఈ సంచికలోని అన్ని శీర్షికలు చాలా బాగున్నాయి. క్రికెట్టే గెలిచింది కవర్ స్టోరీ, టూరిస్ట్‌గైడ్ ఎంతో ఆసక్తికరంగా వున్నాయి. న్యాయసలహాలు, రుచి క్రమం తప్పకుండా ఇస్తున్నందుకు అభినందనలు

– కె.ప్రభాకర్, చిమిర్యాల, నల్గొండ

చైతన్య స్ఫూర్తిగా కవితలు

14-3-04 ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన 'చినుకు', 'ఓటు' కవితలు చాలా చైతన్య స్ఫూర్తిగా అర్థవంతంగా వున్నాయి.

– పి.ప్రభాకరరావు,
ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

మనలో మాట

మంటెక్కుతోంది....

ఇది వడగాడ్పుల సీజన్....

గాలంటే ఒట్టి గాలికాదు.... ప్రాణాలు తోడేసే గాలి...

ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తుగా అసెంబ్లీ రద్దు చేసినప్పటి నుండీ ఈసారి ఎందుకనో అన్నీ ముందస్తుగానే వచ్చేస్తున్నాయి...

ఎండలు, గాడ్పులు కూడా...

మార్చి వెళ్ళనే లేదు.. ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం వేళ రోడ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి.

వడగాడ్పులు బలంగా వీస్తున్నాయి....

ఒకవైపున రాజకీయులకు ఎన్నికల వేడి...

మరోవైపున విద్యార్థులకు పరీక్షల వేడి...

రైతులకు కరెంట్ వేడి...

ఉపఖండంలో క్రికెట్ వేడి...

జనానికి నీటి ఎద్దడి...

సమస్త జనులకు ఏదో ఒక వేడి సోకింది.....

రాజకీయ వడగాడ్పులు మరో నెలరోజుల వరకు బలంగా వీస్తాయని రాజధానిలోని ఎన్నికల వాతావరణ కేంద్రం ప్రకటించింది....

ఈ వడగాడ్పులు చాలా ప్రమాదకరమైనవి -ఏదైనా జరగొచ్చు....

రోడ్డుమీదకెళితే రథయాత్రలు, బజారు ప్రదర్శనలు (రోడ్ షో) దర్శనమిస్తాయి.... నాయకుల నమస్కార బాణాలు తగులుతాయి....

ఇవిగాక సింహగర్జనలు, శంఖారావాలు, గాండ్రింపులు, గందరగోళం, కొండకచోట తుపాకుల ఫైరింగుల దాకా వెళ్ళవచ్చు చెప్పలేం...

పొద్దున్నే పేపర్ తీయగానే నాయకుల అలకలు, బుజ్జగింపులు, తిరుగుబాట్లు, సిగపట్లు, ముష్టియుద్ధాలు వగైరా వగైరా... పత్రికల నిండా వేడి వేడి వార్తలే. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియదు. ఉంటారో తెలియదు. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో చేరతారో ఆ బ్రహ్మకు కూడా తెలియదు...

ఇంట్లో టీవీ ఆన్‌చేయగానే భారత్ వెలిగిపోతోందని ఒకటే ఊదర. ఫోన్ ఎత్తితే మై బోల్ రహా హూఁ అంటూ అనూహ్య పలుకరింపు...

ఇన్నిరకాల గోలలతో ఎన్నికల వడగాడ్పులు మరింత వేడెక్కుతున్నాయి....

ఇవన్నీ చూసి సామాన్యుడికి మంటెక్కుతోంది...

ఏమైనా ఈ నెల రోజులూ జాగ్రత్తగా ఉండాలి. లేదా మాడి మసైపోతారు...

తస్మాత్ జాగ్రత్త...!

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

అమెరికా అమ్మాయి
కథ...8, 9



'కల్లెడ' సంస్కృతి అంతటా వ్యాపించాలి
రియల్‌స్టోరీ... 14, 15



ఆచార్య నాగార్జునుడు బోధించిన చోటు...
టూరిస్ట్ గైడ్ . . . 21



పిట్టకొంచెం - బొమ్మలు ఘనం
కళాసాహితి . . . 22, 23

ఓరా!



గుడ్డు - కోడి

మనదేశంలో కోడిగుడ్ల ఉత్పత్తి ఎక్కువై రేట్లు పడిపోయి రైతులు లబోదిబో అంటున్నారు.. నార్వేలోనేమో కోడిగుడ్లకు విపరీతమైన కొరత ఏర్పడిందట! గుడ్లు దొరక్క ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆ దేశ చట్టసభలో ఒక సభ్యుడు ప్రభుత్వానికి చెప్పాడు. వెంటనే గుడ్ల ఉత్పత్తి పెరగడానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఆయన డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో అనుకోకుండా వ్యవసాయశాఖమంత్రికి ఈ ప్రశ్న తగిలేసరికి ఆయన ఇబ్బందుల్లో పడ్డాడట! దీనికి పార్లమెంట్ చేయగలిగేదేమీ లేదు, ప్రతి ఒక్కరూ కోళ్లను పెంచుకోవడమే పరిష్కారమని ఆ మంత్రి చెప్పేసరికి సభ్యులంతా గొల్లుమన్నారట! పాపం నార్వే ప్రజలు గుడ్లకోసం ఇంతగా అల్లాడిపోతున్నపుడు మన దేశం నుండి ఎగుమతి చేస్తే పోలా?

ఎరక్కపోయి పడ్డాడు!

దొంగతనం చేయడానికి కూడా నేర్పు కావలి. లేకుంటే పని జరక్కపోగా ప్రాణాలమీదకే తెచ్చుకుంటారని ఒక దొంగగారు వాపోతున్నారు. జర్మనీలోని బోచమ్ నగరంలో ఒక బట్టలమిల్లులో దొంగతనానికి వెళ్లిన ఒక దొంగ కాలుజారి బట్టల రీసైక్లింగ్ బిన్‌లో పడి విలవిల్లాడట! అక్కడే గల కొత్త బట్టల కంటెనయర్ నుండి అందినన్ని బట్టలు దొంగిలించుకుపోదామని వచ్చిన దొంగ సరదాగా సిగరెట్ వెలిగించుకునే ప్రయత్నంలో కాలుజారి పక్కనే గల రీసైక్లింగ్ బిన్‌లో పడ్డాడు.ఆ సమయంలో అది పనిలో లేనందువల్ల బ్రతికిపోయాడా దొంగ. లేకుంటే గుడ్డ పీలికల టైపులో బయటకు వచ్చేవాడేమో! అందులో పడుతూనే అరుపులకు లంకించుకోవడంతో సెక్యూరిటీ సిబ్బంది కంగారుగా వచ్చారట.

పూర్తిగా బట్టల్లో మునిగిపోయిన ఆ దొంగ చేతులు మాత్రమే బయటికి కనిపిస్తున్నాయట, రెండు వేళ్ల నడుమ సిగరెట్‌తో సహా! ప్రాణాల మీదకు వచ్చినా సిగరెట్ వదల్లేదన్నమాట?!

రైల్వే యోగ

ఈ మధ్య కాలంలో ప్రతి పనినీ యోగాతో ముడిపెడుతున్నారు. యోగాతో ఏదైనా సాధించవచ్చని చెబుతున్నారు. రైల్వే బోర్డ్ మాజీ ఛైర్మన్ వి కె అగర్వాల్ రైల్వేల నిర్వహణలో యోగా ప్రాధాన్యతపై ఒక పుస్తకం రాసి అచ్చు వేయించారట. వందలాది మంది రైల్వే ఉద్యోగులు, అనేకమంది పెద్దల సమక్షంలో దాన్ని ఆవిష్కరించారట కూడా. యోగ చేస్తే ఉద్యోగుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పరిశుభ్రత, భద్రత, సానుకూల దృక్పథం అలవడుతాయన్నది ఆ పుస్తకం సారాంశమట. పాలనా కార్యక్రమాల్లో 60 శాతం పనులు వ్యక్తుల సామర్థ్యం మీదనే ఆధారపడి ఉంటుందని అగర్వాల్ చెబుతారు. యోగా వ్యక్తి సామర్థ్యాన్ని పెంచి పనులు చురుగ్గా, క్రమబద్ధంగా చేయిస్తుందట. కనుక రైల్వే ఉద్యోగులంతా యోగాభ్యాసం చేయవలసిందిగా అగర్వాల్ గారి సూచన!?


తిరుగుబాట్లు

కార్టూన్ కదంబం


రామ... రామ...


సైకిల్ మొత్తంగా ఇవ్వనివ్వడం లేదు సార్ అందుకని ఇలా విడివిడిగా...
ఎన్నికల కోడ్‌ను బేఖాతరు చేస్తూ జన్మభూమి సైకిళ్లు పంపిణీని అడ్డుకున్న వామపక్ష కార్యకర్తలు

మన పార్లమెంట్

పినపాక పద్మావతి



అది 1952 మే 13. భారత పార్లమెంటరీ చరిత్రలో ఓ మైలురాయి. స్వతంత్ర భారతంలో తొలిసారిగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో గెలుపొందిన ప్రతినిధులు 'హౌస్ ఆఫ్ ది పీపుల్'లో అడుగుపెట్టిన రోజు. ప్రస్తుతం దానినే లోక్‌సభగా వ్యవహరిస్తున్నారు. అదే రోజు ఇప్పుడు రాజ్యసభగా పిలవబడుతున్న 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్' కూడా విడిగా సమావేశమైంది. నాటి నుండీ నేటి వరకూ దేశ ప్రజలకు పార్లమెంట్ ప్రియనేస్తమైంది. మార్గదర్శకురాలిగా మారింది. రాజ్యాంగం నిర్దేశించిన పథంలో నడుస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళుతోంది. ఐదు దశాబ్దాలుగా ప్రజల వాణిని వినిపిస్తూనే ఉంది. వారి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూనే ఉంది. వారి సమస్యల్ని పాలకుల ముందుకు తెస్తూనే ఉంది. ఈ క్రమంలోనే దేశ ప్రజలు, సంస్కృతి, సంప్రదాయాలకు అసలు సిసలైన సూక్ష్మ ప్రపంచంగా ఆవిర్భవించింది. ప్రధానంగా ఎనిమిది విధుల్ని నిర్వర్తిస్తోంది. రాజకీయ, ఆర్థిక నియంత్రణ లేదా కార్యనిర్వాహక బాధ్యత పార్లమెంట్‌దే. అంతేకాదు, పరిపాలనపై నిఘా వేసి ఉంచేది కూడా ఈ చట్టసభే. ప్రజలకు సమాచారాన్ని అందించడంతో పాటు వారికి ప్రాతినిధ్యం వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. ఘర్షణల్ని నివారించి దేశ సమగ్రతకు పాటుపడుతోంది. చట్టాల్ని రూపొందించడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కూడా పార్లమెంట్ విధే. వీటితో పాటు అవసరాల మేరకు రాజ్యాంగాన్ని సవరిస్తోంది. వీటన్నిటినీ పరిశీలిస్తే పార్లమెంటుకు ఉన్న విస్తృత అధికారాలు, విధులు అర్థమవుతాయి. పార్లమెంటు ద్వారానే బిల్లులకు చట్ట రూపం వస్తుంది. ఈ బిల్లులు రెండు రకాలు. ద్రవ్య(ఆర్థిక) బిల్లులు. ద్రవ్యేతర బిల్లులు. పార్లమెంట్ విధిగా ప్రతి సంవత్సరం మూడుసార్లు సమావేశమవుతుంది. అవే బడ్జెట్, వర్షాకాల, శీతాకాల సమావేశాలు. వాయిదా, రద్దు, ప్రోరోగ్ ద్వారా సిట్టింగ్స్ ముగుస్తాయి.

మన దేశానికి 1947లోనే స్వాతంత్ర్యం లభించినప్పటికీ తొలి పార్లమెంట్ సమావేశం జరిగింది మాత్రం 1952లోనే. అప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని. డాక్టర్ రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతి. ఆ సమావేశంలోనే మొట్టమొదటి సాధారణ బడ్జెట్‌ను మే 23న ప్రవేశపెట్టారు. ఆ ఘనత అప్పటి ఆర్థిక మంత్రి సి.డి. దేశ్‌ముఖ్‌కే దక్కింది. తొలి స్పీకర్ జి.వి. మావ్‌లాంకర్. ఆయన 1952 మే 15 నుండి 1957 ఏప్రిల్ వరకూ ఆ పదవిలో కొనసాగారు. అలాగే అనంత శయనం అయ్యంగార్ 1952 మే 30న తొలి డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. లోక్‌సభ స్పీకర్లలో బలరాం జక్కర్ (పదేళ్ళు) ఎక్కువ కాలం, నీలం సంజీవరెడ్డి తక్కువ కాలం (ఐదు నెలలు) పదవిలో కొనసాగారు. రాజ్యసభ తొలి ఛైర్‌పర్సన్‌గా ఎస్.వి. కృష్ణమూర్తి రికార్డుల్లోకి ఎక్కారు. రాజ్యసభ ఛైర్మన్‌గా ఎక్కువ కాలం పనిచేసిన ఘనత మాత్రం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌దే. ఆయన పదేళ్ళ పాటు (1952-62) ఆ పదవిలో కొనసాగారు. ఇక లోక్‌సభ తొలిసారిగా రద్దయింది 1971లో. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఐదో లోక్‌సభను రద్దు చేసి సంచలనం సృష్టించారు. ఆ తర్వాత 1979లో చరణ్‌సింగ్, 1991లో చంద్రశేఖర్ కూడా సభను రద్దు చేశారు. ఇప్పుడు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయంతో వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ముందస్తు ఎన్నికల నిర్ణయం తీసుకొని గడువుకు ఎనిమిది నెలల ముందుగానే సభను రద్దు చేసింది. అంటే ఇప్పటివరకూ లోక్‌సభ నాలుగుసార్లు ఐదేళ్ళ గడువు తీరకుండానే రద్దయింది. 14వ లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ మార్చి 24న ప్రారంభమై మే 13తో ముగుస్తుంది.

1952లో 489 స్థానాలే

1952లో తొలిసారిగా ఎన్నికలు జరిగినప్పుడు లోక్‌సభలో 489 స్థానాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ సంఖ్య 545కు పెరిగింది. తొలి ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్ 364 సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చింది. 1957 ఎన్నికలలో 371 స్థానాలు గెలుచుకొని రెండోసారి అధికారాన్ని కైవసం చేసుకుంది. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ 27 సీట్లు గెలుచుకొని తొలిసభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఆవిర్భవించింది. 1962లో నెహ్రూ వరుసగా మూడోసారి ప్రధాని అయ్యారు. అప్పుడు కాంగ్రెస్‌కు 361 స్థానాలు లభించాయి. కమ్యూనిస్టు పార్టీ 29 స్థానాలతో మరోసారి ప్రధాన ప్రతిపక్ష పార్టీగా నిలిచింది. స్వతంత్ర పార్టీకి 18, భారతీయ జనసంఘ్‌కు 14 సీట్లు లభించాయి. 1967లో ఇందిరాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారాన్ని నిలుపుకుంది. అయితే 1964లో నెహ్రూ మరణానంతరం తొలిసారిగా జరిగిన ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బలు తగిలాయి. మొత్తం 520 స్థానాలలోనూ దానికి లభించినవి 283 సీట్లు మాత్రమే. స్వతంత్ర పార్టీ 44, జనసంఘ్ 35, రెండు సోషలిస్ట్ గ్రూపులకూ కలిపి 46 స్థానాలు వచ్చాయి. 1971లో 'గరీబీ హఠావో' నినాదంతో ఇందిరా కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. మొత్తం 518 సీట్లలో ఆ పార్టీకి 342 స్థానాలు లభించాయి. 19 నెలల అత్యవసర పరిస్థితి అనంతరం 1977లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో తొలిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ఘోర పరాజయం చవిచూసింది. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతాపార్టీ 295 స్థానాలు గెలుచుకుంది (మొత్తం స్థానాలు 542). కాంగ్రెస్ కేవలం 154 సీట్లతో సంతృప్తి పడాల్సి వచ్చింది. అయితే 1980 మధ్యంతర ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. జనతాపార్టీ చీలిపోవడంతో కాంగ్రెస్‌కు సునాయాసంగా విజయం లభించింది. ఆ పార్టీకి మొత్తం 529 స్థానాలలోనూ 353

సీట్లు వచ్చాయి. 1984 అక్టోబర్ 31న ఇందిరాగాంధీ హత్యానంతరం రాజీవ్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతి పవనాలతో అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీకి రికార్డ్ స్థాయిలో 415 (మొత్తం స్థానాలు 542) సీట్లు లభించగా బిజెపికి (ఒకప్పటి జనసంఘ్) కేవలం రెండు సీట్లు దక్కాయి. 1989 ఎన్నికల్లో తొలిసారిగా హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. 197 స్థానాలతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు తగిన మెజారిటీ రాలేదు. 142 స్థానాలు పొందిన జనతా పార్టీ, కొన్ని ప్రాంతీయ పార్టీలు కలిసి నేషనల్ ఫ్రంట్‌గా ఏర్పడి అధికారంలోకి వచ్చాయి. అయితే ఆ ప్రభుత్వం ఎంతో కాలం నిలవలేదు. 86 స్థానాలున్న బిజెపి మతోన్మాదవైఖరి తీసుకుని మద్దతు ఉపసంహరించుకోవడంతో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. ఆ తర్వాత చంద్రశేఖర్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నాలుగు నెలలు మాత్రమే కొనసాగింది. రాజీవ్‌గాంధీ హత్యానంతరం 1991లో పి.వి. నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మొత్తం 543 సీట్లలో కాంగ్రెస్‌కు 232 స్థానాలు లభించాయి. అయోధ్యలో రామమందిరం నిర్మిస్తామని ప్రచారం చేసి హిందూ ఓట్లకు గాలం వేసిన బిజెపికి 120 స్థానాలు వచ్చాయి. ఇక 1996 ఎన్నికల్లో కాంగ్రెస్ మునుపెన్నడూ లేని విధంగా పరాజయాన్ని మూటకట్టుకుంది. అప్పటి నుండీ నేటి వరకూ ఆ పార్టీ తిరిగి అధికారాన్ని దక్కించుకోలేకపోతోంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం 140 స్థానాలు మాత్రమే లభించాయి. 161 సీట్లు గెలుచుకున్న బిజెపి వాజ్‌పేయి నేతృత్వంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి కేవలం 13 రోజులు మాత్రమే పరిపాలించింది. ఆ తర్వాత 18 నెలల పాటు కాంగ్రెస్ మద్దతుతో హెచ్.డి. దేవెగౌడ, ఐ.కె. గుజ్రాల్ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. అవకాశవాదవైఖరి తీసుకున్న కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఉపసంహరించుకోవడంతో అవి కూడా ఎంతో కాలం నిలవలేకపోయాయి. 1998లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో బిజెపి 182 స్థానాలు గెలుచుకొని మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కొన్ని చిన్నా చితకా పార్టీలు, ప్రాంతీయ పార్టీల మద్దతుతో వాజ్‌పేయి 13 నెలల పాటు ప్రభుత్వాన్ని నెట్టుకొచ్చారు. అయితే జయలలిత నేతృత్వంలోని అన్నా డిఎంకె పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో మరోసారి మధ్యంతరం తప్పలేదు. 1999 ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. మధ్యలో కుదుపులకు గురైనప్పటికీ ప్రభుత్వాన్ని నడపగలిగింది. గడువు కంటే ఎనిమిది నెలల ముందుగానే లోక్‌సభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళుతోంది.



చరిత్ర సృష్టించిన 1976

పార్లమెంట్ చరిత్రలో 1976కు ఓ ప్రత్యేకత ఉంది. ఆ ఒక్క సంవత్సరంలోనే 118 బిల్లుల్ని ఆమోదించారు. 1989లో తొలిసారిగా లోక్‌సభలో ఏ పార్టీకీ మెజారిటీ రాని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు బిజెపి మద్దతుతో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అది ఎంతో కాలం నిలవలేదు. ఆ తర్వాత వచ్చిన చంద్రశేఖర్ ప్రభుత్వానిదీ అదే దారి. ఈ నేపథ్యంలో 1991లో ఎన్నికలు జరిగాయి. అప్పుడూ హంగ్ పార్లమెంటే ఏర్పడింది. ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించిన కాంగ్రెస్, పి.వి. నరసింహారావు నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జార్ఖండ్ ముక్తిమోర్చా వంటి చిన్నా చితకా పార్టీలకు చెందిన సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన ప్రభుత్వం మెజారిటీ సాధించింది. అవిశ్వాస తీర్మానాన్ని ఓడించేందుకు పి.వి. నరసింహారావు జెఎంఎం ఎంపీలకు ముడుపులు ముట్టచెప్పారంటూ అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు రావడం, ఈ వ్యవహారం న్యాయస్థానాల వరకూ వెళ్ళడం తెలిసిందే. కర్నాటకకు చెందిన జోకిమ్, ఆయన భార్య వయొలెట్ ఆల్వా లోక్‌సభలో ప్రవేశించిన తొలి జంటగా రికార్డు సృష్టించారు. రాజమాత విజయరాజె సింధియా, ఆమె కుమార్తె వసుంధర రాజె, కుమారుడు మాధవరావు సింధియా లోక్‌సభకు ఎన్నికైన తొలి కుటుంబం. వసుంధర ప్రస్తుతం రాజస్థాన్ ముఖ్యమంత్రి. మాధవరావు సింధియా కుమారుడు జ్యోతిరాదిత్య కూడా రద్దయిన లోక్‌సభ సభ్యుడే. విజయరాజె సింధియా, వసుంధర బిజెపికి చెందిన వారు కాగా మాధవరావు కాంగ్రెస్ నేత. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్.జి. రంగా 44 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యునిగా కొనసాగి పార్లమెంట్ చరిత్ర పుటల్లో నిలిచారు. అయితే 1991 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఎనిమిదో లోక్‌సభకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ సభకు మొత్తం 44 మంది మహిళలు ఎన్నికయ్యారు. ఒకేసారి ఇంత ఎక్కువ సంఖ్యలో మహిళలు మరే లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం సాధించలేదు. ఆరో లోక్‌సభలో అతి తక్కువగా కేవలం 19 మంది మహిళలు మాత్రమే అడుగుపెట్టారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హతకు గురైన తొలి వ్యక్తి లాల్‌దుహోమా. ఆయన 1988 నవంబర్ 24న

రాజ్యాంగసభలో తొలిరోజు

రాజ్యాంగసభ తొలిసారిగా 1946 డిసెంబర్ 9న సమావేశమైంది. ముందు వరుసలో జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆచార్య జె.బి. కృపలానీ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సరోజినీ నాయుడు, హరేకృష్ణ మెహతాబ్, పండిట్ గోవింద్ వల్లభ్ పంత్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, శరత్‌చంద్ర బోస్, సి.రాజగోపాలాచారి, ఎం. అసఫ్ అలీ వంటి హేమాహేమీలు ఆశీనులయ్యారు. తొమ్మిది మంది మహిళలు సహా 207 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆ తర్వాత దాదాపు మూడేళ్ళకు (రెండు సంవత్సరాల 11 నెలల 17 రోజులు) రాజ్యాంగసభ తన కర్తవ్యాన్ని పూర్తిచేసింది. సభ మొత్తం 11 సార్లుగా 165 రోజులు సమావేశమైంది. 114 రోజుల పాటు ముసాయిదా రాజ్యాంగాన్ని పరిశీలించారు. 1947లో దేశ విభజన జరిగిన తర్వాత పాకిస్తాన్ కోసం విడిగా రాజ్యాంగసభను ఏర్పాటు చేశారు. దీంతో భారత రాజ్యాంగసభ సభ్యుల సంఖ్య 299కి తగ్గిపోయింది. 1947 ఆగస్టు 14 సాయంత్రం రాజ్యాంగసభ సమావేశమైంది. అదే రోజు రాత్రి మనకు స్వాతంత్ర్యం లభించింది. దీంతో రాజ్యాంగసభ స్వతంత్ర భారత చట్టసభగా అవతరించింది. ముసాయిదా రాజ్యాంగాన్ని రూపొందించేందుకు 1947 ఆగస్టు 29న రాజ్యాంగసభ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ముసాయిదా రాజ్యాంగానికి సంబంధించి 2,473 ప్రతిపాదనలను గురించి కూలంకషంగా చర్చించింది. రాజ్యాంగసభకు మొత్తం 7,635 సవరణలు అందాయి. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదం పొందింది. 1950 జనవరి 24న 284 మంది సభ్యులు దానిపై సంతకం చేశారు. అది జనవరి 26న అమలులోకి వచ్చింది. అదే రోజు సభ ప్రొవెన్షియల్ పార్లమెంట్‌గా ఆవిర్భవించింది. 1952లో కొత్త పార్లమెంట్ ఏర్పడే వరకూ అది కొనసాగింది.

అతిపెద్ద రాజ్యాంగం

ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అతిపెద్ద లిఖిత రాజ్యాంగం, అలాగే అత్యుత్తమమైనదిగా కూడా పేరుపొందింది. దేశ అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందించారు. 1948 ఫిబ్రవరిలో రాజ్యాంగం ముసాయిదాను ప్రచురించారు. 1949 నవంబర్ 26న దీనికి తుది ఆమోదం లభించింది. కాలక్రమంలో రాజ్యాంగానికి అనేక సవరణలు చేశారు. బ్రిటన్ పార్లమెంటరీ తరహా రాజ్యాంగానికి, మన రాజ్యాంగానికి అనేక సామీప్యాలు ఉన్నాయి. అయితే ఒక ముఖ్యమైన అంశంపై మాత్రం రెండింటికీ మధ్య తేడా కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. అదేమంటే మన దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైంది. పార్లమెంట్ కాదు. అందుకే మన దేశంలో న్యాయస్థానాలకు విశేషాధికారాలున్నాయి. పార్లమెంట్ ఆమోదించిన చట్టాలు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయో లేవో నిర్ణయించేది న్యాయస్థానాలే. భారత పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పిస్తోంది. వివక్షను నిషేధిస్తోంది. పౌరులందరికీ ఓటు హక్కు కల్పించింది. అందుకే ప్రపంచంలో మన దేశంలో ఉన్నంతమంది ఓటర్లు మరే దేశంలోనూ లేరు.

పార్లమెంట్ భవనాల ఏరియల్ వ్యూ

పార్లమెంట్ మ్యూజియం

పార్లమెంటరీ రికార్డులను భద్రపరచే మ్యూజియం (పిఎంఎ)ను 1989 డిసెంబర్ 29న ప్రారంభించారు. పార్లమెంట్ చరిత్రకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లనూ ఇందులో భద్రపరిచారు. అంతేకాక రాజ్యాంగానికి, పార్లమెంటుకు సంబంధించిన విలువైన ఆర్టికల్స్‌ను కూడా ఇందులోనే భద్రం చేశారు. దేశంలోనూ, విదేశాలలోనూ పార్లమెంటరీ సంస్థల పనితీరును పరిశీలించేందుకు మ్యూజియంలో చార్టులు, ఫొటోలు, ఇతర విజువల్ టెక్నిక్స్‌ను ప్రదర్శించారు. మ్యూజియంను మూడు విభాగాలుగా విభజించారు. దేశంలో ప్రజాస్వామ్య సంస్థల స్వరూప స్వభావాలను మొదటి విభాగంలో చూపారు. విదేశీ పార్లమెంట్లకు సంబంధించిన ఫొటోలు, మోడల్స్‌ను రెండో విభాగంలో ఉంచారు. ఇక మూడో విభాగంలో రాష్ట్రాల చట్టసభలకు సంబంధించిన చిత్రాలు, మోడల్స్‌ను ప్రదర్శించారు. అనేకమంది పార్లమెంట్ సభ్యులు తమ డైరీలు, ప్రముఖ నేతలతో తాము జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఫొటోలను మ్యూజియంకు అందజేశారు. అవసరమైన పక్షంలో మేధావులు, ప్రయివేటు వ్యక్తులు, అధికారులకు రికార్డులను పరిశీలన నిమిత్తం అందజేస్తారు.

పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయారు. లాల్‌దుహోమా 1986లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి మిజో నేషనల్ యూనియన్ పేరిట ప్రాంతీయ పార్టీని స్థాపించారు. 1996, 1999 ఎన్నికల్లో ఔటర్ ఢిల్లీ అత్యధిక ఓటర్లతో దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఆవిర్భవించింది. 1996లో మాత్రం ఆ స్థానం మహారాష్ట్రలోని థానేకు దక్కింది. అతితక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం లక్షద్వీప్. 1999 ఎన్నికల్లో అక్కడ కేవలం 37,619 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. 1999లో ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో అత్యధికంగా 32 మంది, రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో అతి తక్కువగా ఇద్దరు పోటీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 880 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. 1998లో మన రాష్ట్రంలోని ఒంగోలు నుండి అత్యధికంగా 18 మంది, ఆనంద్ (గుజరాత్), సతారా (మహారాష్ట్ర), నాగాలాండ్, లక్షద్వీప్ నుండి అతి తక్కువగా ఇద్దరు చొప్పున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణ కోసం 7700 మెట్రిక్ టన్నుల కాగితాన్ని ఉపయోగించారు. 1996 ఎన్నికల్లో కూడా ఒక నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీచేసిన ఘనత మన రాష్ట్రానికే దక్కింది. నల్గొండ నుండి రికార్డు స్థాయిలో 480 మంది పోటీ చేశారు. ఎగువ సభగా పిలవబడుతున్న రాజ్యసభకు మన రాష్ట్రం నుండి 18 మంది సభ్యుల్ని ఎన్నుకుంటున్నారు. లోక్‌సభకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు 42 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 545 మంది సభ్యులున్న దిగువసభను లోక్‌సభగానూ, 245 మంది సభ్యులున్న పెద్దలసభను రాజ్యసభగానూ వ్యవహరిస్తున్నారు. లోక్‌సభకు 543 మంది సభ్యుల్ని ప్రజలు ఎన్నుకుంటారు. ఇద్దరిని నామినేట్ చేస్తారు. రాజ్యసభకు 233 మంది ఎన్నికవుతారు. మిగిలిన 12 మందినీ రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. ప్రతి రెండేళ్ళ కొకసారీ మూడోవంతు మంది సభ్యులు రిటైర్ అవుతారు. అందువల్ల లోక్‌సభలాగా రాజ్యసభను రద్దు చేయడం సాధ్యపడదు. లోక్‌సభ కార్యకలాపాలను స్పీకర్, రాజ్యసభ కార్యకలాపాలను ఛైర్మన్ (ఈయనే ఉపరాష్ట్రపతి) నిర్వహిస్తారు. రాష్ట్రాల నుండి లోక్‌సభకు 530 మంది సభ్యుల కంటే అదనంగా, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 20 మంది సభ్యుల కంటే అదనంగా ప్రాతినిధ్యం వహించరాదని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. 1971 నుండి గత ఎన్నికల వరకూ నియోజకవర్గాల భౌగోళిక స్వరూపంలో ఎటువంటి మార్పులూ జరగలేదు.

పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికవ్వాలంటే ఉండాల్సిన అర్హతలేమిటో పరిశీలించడం ఈ సందర్భంగా సముచితంగా ఉంటుంది. చట్టసభకు ఎన్నిక కావాలంటే భారత పౌరుడై ఉండాలి. రాజ్యసభకు ఎన్నిక కావాలంటే కనీసం 30 ఏళ్ళు, లోక్‌సభకు ఎన్నిక కావాలంటే కనీసం పాతికేళ్ళ వయసు ఉండాలి. ఏ పార్లమెంటరీ నియోజకవర్గంలోనైనా ఓటరుగా నమోదై ఉండాలి. రాజ్యసభ సభ్యత్వం కావాలంటే ఏ రాష్ట్రం నుండి ఎన్నిక కాగోరుతున్నారో ఆ రాష్ట్రంలోనే ఓటరై ఉండాలి. అనర్హతల విషయానికొస్తే, లాభాలను ఆర్జించి పెట్టే పదవిని చేపడితే సభ్యత్వం కోల్పోతారు. మానసిక స్థితి సరిగా లేకపోయినా, అప్పులు తీర్చలేక దివాళా తీసినా, భారత పౌరసత్వం కోల్పోయినా లేక పార్లమెంట్ చేసే చట్టం ద్వారా అయినా అనర్హులవుతారు. ఇటీవల వచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టం ద్వారా కూడా అనర్హత వేటు పడే అవకాశముంది.

ప్రారంభంలో ఎంతో హుందాగా జరిగిన పార్లమెంట్ కార్యకలాపాల తీరు ఇటీవలి కాలంలో పూర్తిగా మారిపోయింది. మొదట్లో ప్రతిపక్షాల విమర్శలకు, డిమాండ్లకు ప్రాధాన్యత, గౌరవాన్ని ఇచ్చిన పాలక పార్టీలు ప్రస్తుతం వాటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మొండిపట్టుతో వ్యవహరిస్తున్నాయి. ప్రధాని వంటి బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు సైతం అసహనం ప్రదర్శించడం, చీటికీ మాటికీ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తడం, అనుచిత వ్యాఖ్యలు-వ్యక్తిగత దూషణలకు దిగడం పరిపాటి అయింది. ఇక మంత్రుల సంగతి సరేసరి. ఇటువంటి పరిణామాలన్నీ పార్లమెంట్ ప్రతిష్టను దిగజార్చేవేనని చెప్పక తప్పదు. ★

పార్లమెంట్‌ల మాత...

బ్రిటన్ పార్లమెంట్‌ను పార్లమెంటుల మాతగా పిలుస్తారు. ఎందుకంటే పార్లమెంట్ పేరుతో అమలులో ఉన్న చట్టసభలున్న కామన్‌వెల్త్ దేశాలకు బ్రిటన్ పార్లమెంటే మూలం. 14వ శతాబ్దం వరకూ బ్రిటన్ పార్లమెంటుకు కేవలం నామమాత్రపు అధికారాలే ఉండేవి. రెవెన్యూ, ఇతర విధానపరమైన వ్యవహారాలపై మాత్రమే రాజు అభ్యర్థనపై అప్పుడప్పుడూ పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండేవి. 14వ శతాబ్దంలో పరిస్థితి కొంత మారింది. రెవెన్యూ పద్దులపై ప్రజాప్రతినిధులకు అధికారాలు సంక్రమించాయి. పదిహేనో శతాబ్దంలో మరిన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. అనేక పాలనాపరమైన, చట్టపరమైన అధికారాలు దానికి లభించాయి. 16వ శతాబ్దంలో పెద్దలసభ (హౌస్‌ఆఫ్ లార్డ్స్), దిగువసభ (హౌస్ ఆఫ్ కామన్స్) కొత్త రూపు సంతరించుకున్నాయి. అవే మన రాజ్యసభ, లోక్‌సభ ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చాయి. 1800వ సంవత్సరం తర్వాత పార్లమెంటరీ వ్యవస్థలో గణనీయ మార్పు వచ్చింది. ఐర్లాండ్ పార్లమెంట్ రద్దయి బ్రిటన్ పార్లమెంటులో విలీనమైంది. 19వ శతాబ్దం చివరలో కార్మికలోకానికి చెందిన సభ్యులు హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికయ్యారు. ఆ తర్వాత వారు లేబర్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్దలసభ బలహీనపడింది. దిగువసభ ఆమోదించిన బిల్లును ఎగువసభ వీటో చేస్తే అది మరోసారి దిగువసభ ఆమోదం పొందిన పక్షంలో చట్టంగా మారుతుంది. ఈ విధంగా 1911వ సంవత్సరపు పార్లమెంట్ చట్టం ద్వారా హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు కళ తప్పింది.

కథ

వెంకట్

టైము కరెక్టుగా 12 గంటల 50 నిముషాలయింది. డిగ్రీ కాలేజీ నుండి విద్యార్థులు గుంపులుగా కబుర్లు చెప్పుకొంటూ బయటకు వస్తున్నారు. అందులో ఓ కుర్రాడు వాడిపోయిన మొహంతో సగం సంతోషంతో ఒక పక్కగా వస్తున్నాడు. అతడి పేరు వెంకట్. వయస్సు 18 సంవత్సరాల 6 నెలలు. చదువు బి.కాం. మొదటి సంవత్సరం.



సాయంత్రం 6 గంటలకు అన్న ఇచ్చిన డబ్బులు తీసుకొని రైతుబజారుకు వెళ్ళాడు. మార్కెట్‌లో కూరగాయలు బేరమాడుతున్నాడు. పక్కగా వున్న మైదానంలో క్రీస్తు సువార్త మహాసభలు జరుగుతున్నాయి. ఆ సభలకు అమెరికా నుండి అందమైన యువతులు చాలా మంది వచ్చారు. ఎదురుగా వున్న స్టేజీ మీద పాల్‌గారు ఉపన్యసిస్తుంటే దాన్ని వేరొక వ్యక్తి తెలుగులోకి అనువదిస్తున్నాడు. ఆ యువతులలో 19 సంవత్సరాల అందమైన సుందరి లీనస్ కూడా ఉంది. నవ్వితే నవరత్నాలు అన్న చందంగా ఉంది ఆమె చిరు నవ్వు. స్నేహితులు కోర్నిక, జిలెంటాలతో కలిసి ఆమె పక్కగా వున్న మార్కెట్‌కు వెళ్ళింది. వాళ్ళలో వాళ్ళు ఏదో ఇంగ్లీషులో మాట్లాడుకొంటూ నవ్వుకొంటున్నారు. క్యారెట్లు అమ్ముతున్న ఒక వ్యక్తి దగ్గరకు వచ్చి ఇంగ్లీషులో క్యారెట్ రేటు అడిగారు. వాళ్ళు అడిగింది అతనికి అర్థం కాలేదు. దానితో అతడు ఏమీ సమాధానం చెప్పక మౌనంగా ఉన్నాడు.

వెంకట్ మిగతా కూరగాయలన్నీ కొని క్యారెట్లు కొందామని అక్కడకు వచ్చాడు. అప్పుడు అకస్మాత్తుగా లీనస్‌ని చూశాడు. గుండె మంచులో తడిసినట్లయింది. మనసు ఆకాశానికెగిరి పోయింది. సంతోషం సముద్రాలు దాటింది అన్నట్లుగా తికమక పడుతూ ఆమె వంక చూశాడు. ఆమె అడిగింది తెలుగులో వ్యాపారికి చెప్పాడు. అది గ్రహించిన వ్యాపారి లీనస్‌కు క్యారెట్లు ఇచ్చాడు. వారు డబ్బు తేవటం మర్చిపోయారు. మతిమరుపుకు నవ్వుకొన్నారు. తీసుకొన్న క్యారెట్లను వదలడం ఇష్టం లేక లీనస్ పక్కనే వున్న వెంకట్‌ను హలో అని పిలిచింది. తాను తీసుకొన్న క్యారెట్లకు డబ్బు ఇవ్వమని అడిగింది. అటువంటి సుందరి అడిగితే ఎవరు కాదనగలరు. మనవాడు వెంటనే జేబులో వున్న 10 రూపాయలు తీసి ఇచ్చాడు. తన వెంట రూమ్‌కు వస్తే తాను డబ్బు తిరిగి ఇస్తానని వెంకట్‌ను తీసుకెళ్ళింది. వెంకట్ ఆమె వంకే చూస్తున్నాడు. తనలో తానే ఏమేమో ఊహించుకొంటూ తిని పడవేసిన అరటి తొక్కపై కాలుపెట్టి జారి పక్కనున్న సైడు కాల్వలో పడ్డాడు. పక్కన వున్న లీనస్ స్నేహితులు కోర్నికా, జిలెంటాలు అతడ్ని చూసి ఫక్కున నవ్వారు. పాపం వెంకట్ చేతిలో ఉన్న కూరగాయలు బురదలో పడ్డాయి. షర్టునిండా బురద. చేతివేలికి గాయమైంది. లీనస్‌కు అతనిని చూసి జాలివేసింది. చేయి ఇచ్చి పైకి లేపబోయింది. కానీ వెంకట్ మాత్రం నో థాంక్స్ అని అతడే పైకి లేచాడు. ఆమె అతడి వంక చూసి నేను చేతినందించటం నీకు ఇష్టంలేదా అని అడిగింది. కాదంటూ నా చేతి బురద నీకు అంటుతుందేమోనని అన్నాడు. ఓ.కే. నా రూమ్‌కు వచ్చి ఆ బురద కడుక్కొని వెళ్ళవచ్చునని చెప్పింది. ఆ బురదతో సభ దాకా రావటం ఇష్టం లేక ఆమెతో నేను ఇంటికి వెళతాను అన్నాడు. మరి నీ డబ్బు అందావిడ. ఫర్వాలేదు పదిరూపాయలే కదా అన్నాడు. లీనస్ చాలా సున్నిత హృదయం కలది. సరే అన్నట్లుగా వెళ్ళిపోయింది. వెంకట్ ఒక పంపు దగ్గర బురద కడుక్కొని బస్టాండ్‌కు వెళ్ళాడు. చాలా లేటయింది. బస్ అప్పటికే వెళ్ళిపోయింది. తన దగ్గర డబ్బులు లేవు. 7 కి.మీ. దూరం నడుచుకుంటూ ఇంటికి వెళ్ళి జరిగింది అన్నకు చెప్పాడు. వెంకట్ పడుకొని ఆమె గురించి ఆలోచిస్తూ ఛాన్స్ పోగొట్టుకొన్నాను. ఆమె పేరు, అడ్రస్ కూడా తెలుసుకోలేకపోయానని బాధపడ్డాడు. తాను జీవితంలో ఆమెను కలుసుకోలేనేమో అనుకొంటూ నిద్రలోకి జారుకున్నాడు. ఆ రాత్రి లీనస్ క్యారెట్లు తింటూ వెంకట్‌ను గుర్తు తెచ్చుకొని నవ్వుకొంది.

తెల్లవారింది. వెంకట్ త్వరత్వరగా కాలేజీకి తయారయ్యాడు. అప్పటికే బస్సు వెళ్ళిపోయింది. ఎలాగో తరువాత బస్సుకు వెళ్లాడు. లేటు కావడం చేత లెక్చరర్ వెంకట్‌ను బయటికి పంపించాడు. చేసేది లేక పుస్తకాలు చేతపట్టుకొని ఏదైనా పార్కుకు వెళదాం అని బయలుదేరి వెళుతున్నాడు. దారి మధ్యలో ఫ్రెండ్ ఒకడు కనిపించి ఒరేయ్ వెంకట్ ఇవ్వాళ్ళ అథ్లెటిక్స్ మీట్‌రా. తెలియదా? స్టేడియంలో పదిన్నరకు జరుగుతాయి అని చెప్పాడు. వెంకట్‌కు స్పోర్ట్స్ అంటే పిచ్చిప్రేమ. వెంటనే తనకున్న ఆర్డినరీ షూతోనే స్టేడియంకు వెళ్ళాడు.

లీనస్, ఆమె ఫ్రెండ్స్ ఆరోజు సిటీలో షికారు చేద్దాం అనుకొన్నారు. వాళ్ళు పేపర్ చూస్తూ స్టేడియంలో అథ్లెటిక్స్ మీట్ అని తెలుసుకొన్నారు. లీనస్‌కు అథ్లెట్లంటే అమితమైన ప్రేమ. అమెరికాలో మారిస్‌గ్రీన్, మైకేల్ జాన్సన్‌లను తెగపొగుడుతుంది. ఇండియా రన్నర్స్ ఎంత ఫాస్టో చూడాలనుకొంది. అందరూ స్టేడియంకు వెళ్ళారు.

వెంకట్‌కు ఈ మీట్‌లో గెలవాలని, రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాలని గట్టి కోరిక ఉంది. ఐదు సంవత్సరాలుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. పోటీలు ప్రారంభమయ్యాయి. అంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఇంతలో 100 మీటర్ల పరుగు పందెం ప్రారంభమైంది. అందరినీ పిలిచి ట్రాక్ నెంబర్స్ ఇస్తున్నారు. లీనస్ పక్కగా నుంచొని అందరికీ బెస్ట్ ఆఫ్ లక్ చెబుతోంది. ఇంతలో వెంకట్ కూడా వచ్చాడు. అతడిని చూసి నివ్వెరపోయింది. అతడికి బెస్టాఫ్ లక్ చెబుతోంది. చేతిని వెనక్కి తీసుకొన్నాడు వెంకట్. ఆమె అలాగే చూస్తూ నిలబడిపోయింది. అతనికి చెమటలు పడుతున్నాయి. తాను ప్రేమించిన యువతి ముందు గెలవకపోతే ఎలా!

ఎలాగైనా గెలవాలని దృఢ నిశ్చయంతో ఉన్నాడు. అనుకొన్నట్లు వెంకట్ ఫస్ట్ వచ్చాడు. అతని ఆనందానికి హద్దులు లేవు. లీనస్ ఫ్రెండ్స్ ఆమెతో అతడు మనకు రాత్రి కలిసిన కుర్రాడే కదూ! అతడికి హేట్సాఫ్ చెప్పాలి. వావ్ వండరఫుల్ అన్నారు. లీనస్‌కు ఆరాటం ఆగక వెళ్ళి వెంకట్‌కు ముద్దు పెట్టింది. గ్రేట్‌మాన్ అంది. అంతే వెంకట్ మాటలు లేకుండా నిలబడిపోయాడు. ఏయ్ మాన్ మాట్లాడు. అసలు నువ్వు నాతో మాట్లాడవేంటి. నేను నిన్నేం చేశాను అంది కోపంతో. అమెరికాలో పుట్టి పెరిగిన నీతో స్నేహం చేయాలని వుంది. కానీ నా పేదరికం నన్ను నీతో మాట్లాడకుండా చేస్తోందని చెప్పాడు. నేను ఈ పది రోజులూ నీతో స్నేహంగా ఉంటే తరువాత నిన్ను మర్చిపోలేను. బాధపడాలి.. అందుకే అలా చేశానన్నాడు. నీవన్న మాటలు నిజమే. కానీ మా దేశంలో ధనిక, పేద భేదాలుండవు. మనమిద్దరం ఫ్రెండ్స్. ఇంకేం మాట్లాడకు అని వెంకట్‌ను ఆమె తన రూమ్‌కి తీసుకెళ్ళింది. ఇద్దరూ ఒకరి గురించి ఒకరు ఆసక్తిగా చెప్పుకొన్నారు. ఆమె తాను అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీలో ప్లాంట్స్ మీద ప్రత్యేక కోర్సు చేస్తున్నానని చెప్పింది. టిఫిన్ రెడీ చేసి వెంకట్‌ను తినమంది. అలాగే వెంకట్ వంక చూస్తూ నేను అమెరికా నుండి ఇంతదూరం ప్రయాణించి ఇండియాకు వచ్చింది నీతో ఫ్రెండ్‌షిప్ చేయడానికేనేమో? విచిత్రంగా ఉంది కదూ అంది.

తరువాత ఒకరోజు వెంకట్ లీనస్‌ను వాళ్ళ పల్లెటూరికి తీసుకెళ్ళాడు. తన కుటుంబంలోని వారికి ఆ అమ్మాయిని పరిచయం చేశాడు. వారు నివ్వెరపోయారు. పొరుగువారు అసూయతో చెవులు కొరుక్కున్నారు. వెంకట్ వారిని పట్టించుకోలేదు. లీనస్‌ను తీసుకొని పొలానికి వెళ్ళాడు. పైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. లీనస్ అవన్నీ చూసి కేరింతలు కొడుతూ ఇండియా ఈజ్ వెరీ వెరీ స్పెషల్. దిస్ విలేజ్ ఈజ్ వండర్‌ఫుల్, ఫెంటాస్టిక్ అని పొగిడింది. ఇద్దరూ పొలాల వెంట పరుగెడుతున్నారు.

ఇంతలో నల్లటి కారుమేఘాలు ఆకాశాన్ని చుట్టుముట్టేశాయి. చినుకులు చిటపట పడటం ప్రారంభించాయి. ప్రకృతి అంతా చీకటిగా మారిపోయింది. వెంకట్, లీనస్‌లు కందిచేలో ఉన్న పెద్ద చెట్టు కింద కూర్చున్నారు. వర్షం జోరుగా కురుస్తోంది. ఇద్దరూ చెట్ల మొదలులో ఇరుకుగా దగ్గరగా కూర్చున్నాడు. పొలాలలో ఎటుచూసినా పురుగు కూడా కనిపించటం లేదు. వెంకట్‌తో తనకు భయంగా వుందని లీనస్ చెప్పింది. నీకు నేనున్నాను. నా ప్రాణాలు అడ్డుపెట్టయినా సరే నీకేం జరగనివ్వను. చీకటంటే భయమా అని అడిగాడు. అదేం లేదులే. ఏమైనా క్రూరమృగాలు ఇటువస్తే ఇంకేమైనా ఉందా అంది. వెంకట్ నవ్వి... అటువంటివేమీ లేవు భయపడకు అని ధైర్యం చెప్పాడు.

ఇద్దరూ చెట్టు కింద నుంచి బయటకు వచ్చారు. ఇంటికి బయలుదేరారు. ఆమె గట్టు మీద కాలుపెట్టి జారి వెంకట్‌ను తగిలింది. అతను ఆమెను పట్టుకొని జారిపడ్డాడు. ఇద్దరూ ఒకరిమీద ఒకరు పడ్డారు. వెంకట్ ఆమెను అలాగే చూస్తున్నాడు. ఆమె కూడా అలాగే చూస్తోంది. ఇద్దరూ నవ్వుకొన్నారు. పైకి లేచి చూసుకొన్నారు. ఒంటినిండా బురద. చెక్‌డ్యాం దగ్గరకెళ్ళి బురదకడుగుకొన్నారు. నాకు చాలా ఆకలిగా ఉందని లీనస్ చెప్పగానే వెంకట్ చిటికెలో వెళ్ళి వేరుశెనగ మండలు సేకరించి వాటి కాయలు, ముదురు కందికాయలు తీసుకొని క్షణాల్లో తెచ్చి ఆమెకిచ్చాడు. లీనస్ అవి తిని చాలా రుచిగా వున్నాయంది. లీనస్‌ను సైకిల్ మీద కూర్చోబెట్టుకొని కబుర్లు చెబుతూ తొక్కుతున్నాడు. ఆమె వెంకట్ వైపు రెప్ప వాల్చకుండా చూస్తోంది. అతన్ని తన వాడిని చేసుకోవాలనే కోరిక గాఢంగా కలుగుతోంది.

ఆమెకు తెలియకుండానే ప్రేమించేస్తోంది. వాళ్ళకు టైము తెలియలేదు. అంతలో రూమ్ వచ్చింది. ఆమెను దించి బై చెప్పి వెళ్ళబోయాడు. ఆమె అప్పుడైనా ఏదైనా తీసుకొని వెళ్ళవచ్చునని అడ్డుగా నుంచొంది. సరే అన్నాడు. ఆమెను చూసిన వాళ్ళ ఫ్రెండ్స్ ఎక్కడికి వెళ్ళావు నీ కోసం ఎంత వెతికామో తెలుసా! ఒక మాట చెప్పి వెళ్ళవచ్చు కదా! నీకేదైనా జరిగితే ఏంటి? అసలే మనం విదేశంలోవున్నాం. చెప్పి వెళదామనుకొంటే సరిగ్గా టైముకు మీరు లేరు. వెంకట్ వున్నాడు కదా అంది లీనస్. అతడు ఉండగా నాకు భయమేంటి? ఇవాళ నన్ను వాళ్ళ పొలానికి తీసుకెళ్ళాడు. అసలు టైమ్ తెలియలేదు. చాలా ఎంజాయ్ చేశాం తెలుసా! అంది. ఆమె ఇచ్చిన బూస్ట్ తాగి ఇంటికి వెళ్ళాడు.

రాత్రి సమయంలో లీనస్ తన ఫ్రెండ్స్‌కు వెంకట్ గురించి చెప్పింది. అతడు లేనిదే క్షణముండలేకపోతున్నాను. అతన్ని విడిచి వుండలేను అంది. వారు అబ్బా అంత బాగా నచ్చాడా! అతనిలో నీకు నచ్చిందేమిటి అని అడిగారు. అతని నిజాయితీ, అమాయకత్వం, పోటీతత్వం నన్ను ఆకర్షించాయి. మా జంట ఇతరులు ఓర్వలేని విధంగా ఉంది అనగానే వాళ్ళు



అమ్మో నాలుగు రోజులకే ఇంత తెలివి తేటలు నీకెలా వచ్చాయ్ అంటూ ఆమెను ఆటపట్టించారు. వారి సభలు అయిపోయాయి. అందరూ అమెరికాకు వెళ్ళటానికి సిద్ధమవుతున్నారు. రేపే మన దేశ ప్రయాణం అని లీనస్‌కు వాళ్ళ ఫ్రెండ్స్ చెప్పారు. లీనస్‌కు వెంకట్ గురించి ఒకటే ఆలోచన. అందరూ లగేజ్ సర్దుకొని విమానాశ్రయానికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నారు. లీనస్ వెంకట్‌ను రమ్మని కబురు చేసింది. వెంటనే వచ్చాడు. తనంటే లీనస్‌కు ఇష్టం లేదేమో అనుకొని బాధపడుతున్నాడు. ఆరోజే ఆమె ప్రయాణం అని తెలుసుకొన్న వెంకట్‌కు ఆమెను చూడగానే కళ్ళలో నుండి నీళ్ళ చుక్కలు రాలాయి. లీనస్ కూడా వెంకట్‌ను చూసి దుఃఖాన్ని ఆపుకోలేక దిగమింగుకొంటోంది. వెంకట్ కన్నీళ్ళు తుడిచి ఏంటీ అంత బాధ. మనం లైఫ్‌లో కలవలేమనా, నిన్ను చూడటానికి నేను వచ్చే సంవత్సరం మళ్ళీ ఇండియా వస్తాను. నిన్ను ఎప్పటికీ మర్చిపోలేను. ఫ్రెండ్ జాగ్రత్త వెళ్ళొస్తా అని చెప్పి వెళ్ళి కారు ఎక్కింది. వెంకట్ అలాగే శూన్యంలోకి చూస్తున్నాడు. లీనస్ కారు ఎక్కి కొంతదూరం ముందుకు వెళ్ళింది. దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. కారు దిగి వెనక్కి తిరిగి చూసింది. వెంకట్ తన చొక్కా కాలర్‌తో కన్నీళ్ళు తుడుచుకొంటూ ముందుకు నడవసాగాడు. ఒక్కసారిగా లీనస్ వెంకట్‌ను పెద్దగా పిలిచింది.

వెనుదిరిగి చూశాడు. లీనస్ క్షణంలో వచ్చి అమాంతంగా కౌగిలించుకొని ఐ లైక్ యూ. నిన్ను విడిచి వెళ్ళలేకపోతున్నాను అంది. నిన్ను చూసిన మొదటి క్షణంలోనే నిన్ను ప్రేమించాను. కానీ నీ స్నేహం దూరమవుతుందని చెప్పలేకపోయాను. నిన్ను విడిచి నేనుండలేను అని వెంకట్ బాధగా చెప్పాడు. ఆ అనుభూతి వారి జీవితాలలో మరిచిపోలేనిది. వారిద్దరూ అలాగే ఉన్నారు. జనమంతా గుమిగూడారు. లీనస్ ఫ్రెండ్స్ వెనక్కి వచ్చి ఆమెను పిలిచారు. వెంకట్ లీనస్‌ను తీసుకెళ్ళి కారులో కూర్చోబెట్టాడు. ఆమెను ఓదార్చాడు. లీనస్ అమెరికా వెళ్ళిపోయింది.

వెంకట్ మొహంలో విషాద ఛాయలు అలముకొన్నాయి. జీవితం కష్టాల కడలిలా మారింది. అయినా ఎదురీదుతున్నాడు. పట్టు విడవని విక్రమార్కుడిలా రోజూ ప్రాక్టీస్‌కు వెళుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాడు. అయినా అతని మొహంలో వెలుగు లేదు.

అమెరికా వెళ్ళగానే లీనస్ వాళ్ళ నాన్నకు తన ప్రేమ వ్యవహారాన్ని చెప్పింది. అందుకు అతను అంగీకరించలేదు. ఆమె బాధపడింది. ప్రాధేయపడింది. కానీ ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. మరలా క్రీస్తు సువార్త మహాసభలు రానే వచ్చాయి. అందరూ ఇండియా వెళ్తున్నారు. లీనస్ చాలా సంతోషంతో ఉంది. తాను కూడా ఫ్రెండ్స్‌తో పాటు ఇండియా వెళతానని తన తండ్రి వద్ద మొండిపట్టు పట్టింది. కానీ అతను ఈమె వెళ్ళకుండా ఇంట్లో కట్టిపడేశాడు.

ఇక్కడ వెంకట్ రాష్ట్ర స్థాయిలో పోటీలకు సన్నద్ధమవుతున్నాడు. మరలా క్రీస్తు సభలని తెలుసుకొని ఆరాటంగా అక్కడకు వచ్చాడు. దారి మధ్యలో యాక్సిడెంట్ అయ్యింది. కాలుకు బలమైన గాయం తగిలింది. అయినా సరే లెక్కచేయక అక్కడకు వెళ్ళి ఆమె కోసం వెతకనారంభించాడు. చివరకు లీనస్ ఫ్రెండ్ జిలెంటా కనిపించింది. ఆతృతతో వచ్చి రొప్పుతూ ఆమెను లీనస్ ఎక్కడ? ఆమెను చూడకుండా ఉండలేకపోతున్నానని చెప్పాడు. మీ ప్రేమ వ్యవహారం గురించి వాళ్ళ ఫాదర్‌కు తెలిసింది. ఆమెను రానివ్వకుండా కట్టిపడేశాడు అని చెప్పి కాలుకు గాయమేంటి ఓ! మై గాడ్ బ్లడ్ వస్తున్నా అలా నుంచొని చూస్తున్నావు అని ఆమె రూమ్‌కు తీసుకెళ్ళి కట్టుకట్టింది. వెంకట్ చాలా నీరసపడిపోయాడు. ఆమె వెంకట్‌ను చూసి డీలాపడింది. నిమ్మరసం ఇచ్చి వెంకట్‌ను లేపింది. లీనస్‌ను ఇంక కలవలేనా అంటూ వెంకట్ చాలా బాధపడ్డాడు. లీనస్‌ను మర్చిపోవలసిందేనా అని వాపోయాడు. లీనస్ ఫొటో ఏదైనా ఉంటే తనకివ్వమని జిలెంటాను బ్రతిమాలాడు. తాము ఫ్లోరిడా యూనివర్సిటీలో దిగిన ఫొటో ఉంటే అతనికిచ్చింది. ఆ ఫొటో చూసిన వెంకట్ ముఖం వెలిగిపోయింది. నిజంగా ఆమెను చూసినట్లుగానే ఆనంద పడ్డాడు. వెంటనే ఫొటో లాక్కొని ముద్దుపెట్టుకొన్నాడు. తాను దాచుకొన్న డబ్బుతో ఒక ఉంగరం గిఫ్ట్‌గా కొని దానిని లీనస్‌కు ఇవ్వమని జిలెంటాకు ఇచ్చాడు. అలాగే లేచి కుంటుకుంటూ ఇంటికి వెళ్ళాడు.

సభలు అయిపోయిన తర్వాత అందరూ అమెరికా వెళ్ళిపోయారు. జిలెంటా ఫ్లోరిడాలోని కాలేజీకి వెళ్ళి లీనస్‌ను కలుసుకొంది. వెంకట్ కాలికి బలమైన గాయం తగిలిందని, చాలా చిక్కి పోయాడని చెప్పింది. నీవు రాలేదని తెలుసుకొని కుమిలిపోయాడని, నా దగ్గర ఉన్న నీ ఫొటోను తీసుకొన్నాడని నీకు గిఫ్ట్‌గా ఈ ఉంగరం ఇచ్చాడని బ్యాగు తీసి చూసింది. ఉంగరం కనపడలేదు. ఇద్దరూ బ్యాగు మొత్తం వెతికారు కనపడలేదు. లీనస్‌కు ఏడ్పు వచ్చింది. బ్యాగును విసిరేసింది. ఉంగరం ఎగిరి

(మిగతా 15వ పేజీలో)

అభివృద్ధిలో అసమానతలు

ముదిగంటి సుజాతారెడ్డి

మాలిని లోపలికి వచ్చింది. చాలా అలసిపోయినట్లుగా కన్పించింది.

"ఆంటీ! కాస్త మంచినీళ్ళు ఇస్తారా!" అడిగింది. గ్లాసులో మంచినీళ్ళు తెచ్చియిచ్చాను. తాగింది.

"ష్! ఆంటీ చాలా అలసిపోయాను. తాళం తీసుకొని ఇంట్లోకి పోయి మంచినీళ్ళు తాగే ఓపిక లేక మీ దర్వాజా తీసి వుండటం చూసి లోపలికి వచ్చాను" అంది.

"ఎక్కడికి వెళ్ళావు? ఇది నువ్వు ఆదిత్యను స్కూలు బస్సు ఎక్కించి తిరిగి వచ్చే టైమ్ కదూ?" అడిగాను.

"అవును ఆంటీ! వాడ్ని స్కూలు బస్సు ఎక్కించే వస్తున్నాను. కాని ఎంత రష్ ఆంటీ! ఆ రష్‌ను చూసే నాకు అలసట వచ్చేసింది. రోడ్ల మీద ఎంత జనమో! కార్లు, మోటారుసైకిళ్ళు, సైకిళ్ళు స్కూటర్లు... నానా రకాల వాహనాలు... వాటన్నిటినీ తప్పించుకొని రోడ్డు దాటేసరికి తలతిరిగిపోయింది ఆంటీ!" అంది మాలిని.

"రోజూ వున్నదే గదా ఈ రష్!" అన్నాను.

"అదే! కానీ రోజురోజుకు రద్దీ ఎక్కువవుతుందేమోననిపిస్తుంది ఆంటీ. మొన్న ఆదిత్యకు సెలవులిస్తే మా ఊరికి వెళ్ళి వచ్చాం. అక్కడ ఇంత జనం, వాహనాలున్నట్లనిపించలేదు. హాయిగా అనిపించింది!" అంది మాలిని.

నేను చిరునవ్వునవ్వాను. వెంటనే మళ్ళా మాలిని అందుకుంది.

"ఉన్న జనం, వాహనాలు సిటీలోనే వున్నట్లనిపిస్తుంది! అబ్బ! ష్!..." మాలిని పైట కొంగుతో గాలి విసురుకుంది.

"ఇంకా ఎండాకాలం రానేలేదు. అప్పుడే ఇంతవేడి..." అంది. మాలిని గాబరా చూసి నేను ఫ్యాన్ వేశాను.

"అసలు అన్ని చోట్ల నుంచి జనం పట్నానికి తరలివస్తున్నారు. ఆఫీసులు, కాలేజీలు విశ్వవిద్యాలయాలు అన్నీ ఇక్కడేనాయె. ఉద్యోగాలు ఇక్కడే! కరువు వచ్చినా ఏది వచ్చినా జనం ఇక్కడైతే పనులు దొరుకుతాయని పట్నం వచ్చేస్తారు. మరి ఇక్కడే ఇండ్ల కట్టడాలు - ఆ పనైనా చేసుకోవచ్చునని జనం వలస వస్తారు. మరి కొంతమంది ఇండ్లల్ల పనులు చేసుకోనైనా బతుకుతామని వస్తారు. ఏ ఆటో తోలుకొనయినా బతకవచ్చుననుకుంటారు మరికొంతమంది. ఇక సినిమాలల్లో పని అని, సాఫ్ట్‌వేర్‌ల్లో పని అనీ కలలు కనే వాళ్ళూ ఇక్కడికే వచ్చేస్తుంటారు. ఇట్లా అన్నీ పట్నంలోనే కేంద్రీకరింపబడటంతో జనం ఇక్కడకే తరలివస్తారు. దాంతో సిటీలో జనాభా రోజురోజుకీ పెరిగిపోతున్నది" అన్నాన్నేను. "అయినా ఆంటీ! అన్నీ సిటీలోనే వుండాలనుకోవటం ఎందుకు చెప్పండి!" అంది మాలిని విసుగ్గా. "అదే మరి! అభివృద్ధి అంతా పట్నంలోనే కన్పిస్తుంది. పల్లెలు పూర్తిగా పాడుబడిపోతున్నాయి. అక్కడా బడులు కళాశాలలు వుండాలి. అవేగాక ఉద్యోగావకాశాలు, వృత్తి పనులు అక్కడా అభివృద్ధి చెందాలి. పరిశ్రమలు కొన్ని పల్లెల్లో, జిల్లాల్లో రావాలి. అన్నిటికన్నా మించి వ్యవసాయం అభివృద్ధి చెందాలి. రైతు చల్లగా వుంటేనే పల్లెలు పచ్చగా కళకళలాడుతూ వుంటాయి..." అని చెప్తున్నాను. నా మాట పూర్తికాక ముందే మాలిని అంది - "ఆంటీ! ఈ గ్లోబలైజేషన్... అంటే అదే ప్రపంచీకరణం పేరుతో మరీ పల్లెల వైపు ఎవరూ చూడటం లేదేమోననిపిస్తుంది. అందరికీ పట్నం మీదనే మోజు!"

"మరి అభివృద్ధి అంతా పట్నంలోనే వుంటే జనం అక్కడికే బతుకుతెరువు దొరుకుతుందని వలసలు వస్తారు. అట్లా వలసలు ఆగాలంటే అన్ని ప్రాంతాలు పల్లెలు, నగరాలు అన్నీ సమానంగా అభివృద్ధి కావాలి. అభివృద్ధిలో అసమానతలున్నంతకాలం ఈ వలసలు తప్పవు. అప్పుడు పట్నంలో రద్దీలు తప్పవు. కష్టాలు తప్పవు!" అన్నాను. "ఏమో! ఆంటీ! రోడ్డు దాటి ఆదిత్యను స్కూలు బస్సు ఎక్కించి మళ్ళా రోడ్డు దాటి ఈ పక్కకు వచ్చేసరికి నాకు ఎంతో దూరం ప్రయాణం చేసి వచ్చినంత పని అవుతున్నది రోజూ. ఈ రష్ చూసే ఎంతో దూరం లేకున్నా నేనే పోయివాడ్ని బస్సు ఎక్కించి వస్తున్నాను. ఇంత దగ్గరే అయినా ఇదో పని అయిపోయింది. నాకు" విసుగ్గా అంది మాలిని.

అన్ని అభివృద్ధి పనుల్లో లోపాలున్నట్లే ఇదిగో-ఈ పట్నం ఒక్కటే అభివృద్ధి కావాలనుకోవడం లోపమే! ఏంచేస్తాం!'' అనంతృప్తిగా పెదవి విరిచాన్నేను. ★

కలుపు మొక్కలు

పి.ఎం.సుందరరావు

రైతు రంగయ్య కొడుకు లోకేష్. హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నాడు. అతనికి చెడు స్నేహాలు అలవాటయ్యాయి. స్కూల్‌కి వెళ్లకుండా ఆకతాయి పిల్లలతో కలిసి ఆటపాటలతో కాలక్షేపం చేయసాగాడు. ఎప్పుడైనా బుద్ధి పుట్టినప్పుడు బడికి వెళ్లేవాడు. అయినా క్లాసులోని విద్యార్థులు వాడితో సరిగా మాట్లాడేవారు కాదు. ఒకవేళ ఏదైనా అవసరమై వీడు పలుకరించినా మాట్లాడేవారుకాదు. అంతేకాదు వాళ్లంతా చదువురాని లోకేష్‌కి దూరంగా వుండసాగారు.

తనను తోటి విద్యార్థులంతా హీనంగా చూడటం లోకేష్ మనసును కలచివేసింది. ఇది చూసి క్లాస్ మాష్టారు శ్రీనివాసరావు అతన్ని స్టాఫ్ రూమ్‌కి తీసుకెళ్లారు. "నువ్వు బాగా చదవకపోతే ఈ సంవత్సరం ఏడవ తరగతి పాసవ్వడం కష్టం" అని చెప్పి మందలించారు. లోకేష్ ఆ విషయాన్ని పట్టించుకోకుండా తన తోటి విద్యార్థులంతా తనను చిన్న చూపు చూస్తున్నారని బాధపడసాగాడు.

ఓ రోజు సాయంత్రం శ్రీనివాసరావు మాష్టారు బజారుకెళ్లారు. అక్కడ ఆయనకు రంగయ్య కనిపించాడు. పిలిచి పరిస్థితి అంతా వివరించాడు. తన కొడుకు లోకేష్ పరిస్థితి విని రంగయ్య చాలా బాధపడ్డాడు. కాని, అతన్ని దారిలో పెట్టడానికి ఓ ఉపాయం ఆలోచించాడు.

ఆదివారం రోజు కొడుకుని తన వెంట పొలం పనికి తీసుకెళ్లాడు. ఆ రోజు పొలంలో కూలీలు మిరపతోటలోని కలుపు మొక్కల్ని ఏరివేస్తున్నారు. లోకేష్‌కి వాళ్లు చేస్తున్న పనేంటో అర్థంకాలేదు. చివరకు తండ్రిని అడిగాడు.

దానికాయన, ''బాబూ! మిరప మొక్కలతోపాటు పనికిరాని కలుపు మొక్కలు కూడా పెరుగుతున్నాయి. వాటి వల్ల ప్రయోజనం ఏమీ లేదు. పైగా పంటకు నష్టం. అందుకే వాటిని పీకి పారేస్తున్నారు. అలాగే నువ్వు చదివే తరగతిలో కూడా కొంతమంది చెడ్డవాళ్లు వుంటారు. అలాంటి వారిని పట్టించుకోకుండా తోటి విద్యార్థులు దూరంగా వుంటారు. తరగతిలోగానీ, బయటగానీ ఎవరైనా పంట మొక్కల్లా వుండాలిగానీ, కలుపు మొక్కల్లా వుండకూడదు. నిన్ను కూడా మీ తరగతిలో అందరూ కలుపుమొక్కగా చూస్తున్నారని తెలిసింది. అది నీ తప్పు. వాళ్లది కాదు. ఇకనుండైనా నీ చెడు స్నేహాలు మానుకో బాగు పడతావు" అని చెప్పాడు.

లోకేష్ తండ్రి మాటల్లోని నిజాన్ని గ్రహించాడు. అప్పటి నుండి చెడ్డ స్నేహితులకు దూరంగా వుంటూ, క్రమం తప్పకుండా బడికి వెళ్లడం మొదలుపెట్టాడు. బాగా చదివి ఏడవ తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. అప్పుడు క్లాసులోని విద్యార్థులందరూ లోకేష్‌ను అభినందించారు.



ఎవరు వీరు?

హాలో...ఏంటర్రా! ఇటు పిలుస్తుంటే అటు తిరుగుతున్నారు? ఓ అదా. మాకు అర్థమైందిలే. 'ఎప్పుడూ ఈ మేజిక్ మేజిక్‌లో మేమేకదా ఓడిపోయేది. ఇవాళ కూడా అంతే కదా' అనుకుంటున్నారుకదూ. కాని ఇవాళ గెలుపు మీదే. అంత కచ్చితంగా ఎలా చెప్తున్నామనుకుంటున్నారా? అదంతే. అంత సులభమైన బొమ్మ తీసుకొచ్చాం ఇవాళ. కావాలంటే చూడండి. బొమ్మలో ఎవరున్నారు? 'ఎవరేంటండీ! ఎవరో ఒక అబ్బాయి వున్నాడు. ఇవాళ మమ్మల్ని బోల్తా కొట్టించలేరు కాక కొట్టించలేరు. మీరన్నట్టు మేమే గెలుస్తాం' అంటున్నారు నేస్తాలంతా ముక్త కంఠంతో. మీరు చెప్పింది కరెక్టే. కానీ మరోసారి చూసి చెప్పొచ్చుకదా. అప్పుడైనా కరెక్టుగా చెప్తారేమో. 'అంటే ఇప్పుడు మేం చెప్పింది తప్పనా మీ ఉద్దేశ్యం' అన్నట్టు కోపంగా చూస్తున్నారు కొందరు చిన్నారులు. కాదురా. మీ సమాధానం రైటే. కానీ ఇంకా కచ్చితమైన జవాబు చెప్పగలరని అలా అన్నాం అంతే. మరోసారి చూస్తారా? 'చూడమంటే చూడం' అన్నట్టు చూస్తున్నారు అంతా. సరే. ఇక చెప్పేస్తున్నాం. అక్కడ ఓ అబద్ధాలకోరు వున్నాడు. మాకెలా తెలిసిందనేగా మీ అనుమానం. కావాలంటే పుస్తకాన్ని ఇటు తిప్పి చదవండి. ఏమని వుంది? లయర్ (*liar*)అనే కదా. అంటే అబద్ధాలకోరు అని అర్థం. ఇప్పుడు అంతా తెలిసినట్టు కనిపిస్తోందా. మరి అదే పరిశీలన అంటే... బాగా పరిశీలిస్తే ఎక్కువ విషయాలు తెలుస్తాయి.

ఫోజు కొడుతోంది ఎవరబ్బా!



చిన్నారి చిత్రకారులు

ఎ.గగన్,
4వ తరగతి,
మాంటిస్సోరి స్కూల్,
కర్నూల్.

యు.స్రవంతి,
9వతరగతి,
జెడ్‌పిహెచ్ఎస్‌స్కూల్,
తొగర్‌పల్లి,
మెదక్

ఎ.వింధ్య,
2వ తరగతి,
మాంటిస్సోరి హైస్కూల్,
కర్నూల్.

నెక్కల రవిచంద్ర, 7వతరగతి,
జె.ఎన్.ఎమ్.హెచ్.స్కూల్,
పెద్దాపురం, తూ.గో.

క్విజ్-2

1. సరోజినీ నాయుడి బిరుదు?
ఎ. గానకోకిల బి. భారతకోకిల

2. ఒక వ్యక్తి రాష్ట్రపతిగా ఎన్నిసార్లు ఎన్నిక కావచ్చు?
ఎ. రెండు సార్లు బి. ఎన్నిసార్లయినా

3. రాకెట్ ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
ఎ.న్యూటన్ మూడవ సూత్రం
బి.న్యూటన్ రెండవ సూత్రం

4. నైలునది ఏ ఖండంలోనిది?
ఎ.ఆఫ్రికా బి. ఆసియా

5. తరగతిగదిలో తప్పనిసరిగా వుండవలసినది...?
ఎ. నల్లబల్ల బి. ఫ్యాను

6. భారతదేశానికి ఉత్తరాన వున్నవి?
ఎ. హిమాలయాలు బి. అరేబియా సముద్రం

7. జలయుతగ్రహమని దేనికి పేరు?
ఎ. భూమి బి. శని

8. అష్టదిగ్గజాలలో పెద్ద ఎవరు?
ఎ. అల్లసాని పెద్దన
బి. నంది తిమ్మన

9. కంది, పెసర, మినుము అనేవి....?
ఎ. కాయ ధాన్యాలు
బి. నూనె గింజలు

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ.అంబేద్కర్ బి.నేతాజీ

క్విజ్ 1కి జవాబులు

1.పట్టు పురుగులు 2. సోడియం కార్బొనేట్ 3. కింది దవడ ఎముక 4. అబుల్‌ఫజల్ 5. మంచినీటి సరస్సు 6. సూర్యుడు 7. రుతువులు 8. కైరో 9. కర్నాటక 10. ఇఎంఎస్

క్విజ్ 100కు సరైన సమాధానాలు రాసిన వారు :

పాటోజు సాయి సుస్మిత, అవలింగి, శ్రీకాకుళం. **పి.శ్రీసత్య,** 8వ తరగతి, టెక్కలి, శ్రీకాకుళం. **పి.సంతోష్‌కుమార్, ఎం.విజయ్‌కుమార్,** 6వ తరగతి, కీతవారిగూడెం, గరిడేపల్లి. **డి.విజయదుర్గ,** 6వ తరగతి, విజయనగరం. **కె.ఫాల్గుణి, ఎస్‌కె. ఫాతిమా,** 9వ తరగతి, కొండ్రముట్ల, ఈపూరు. **ఎల్.ఉదయ్‌శంకర్,** 8వ తరగతి, రాజాం, శ్రీకాకుళం.

కలం స్నేహం

పేరు: బి.గోపాల్,
వయసు : 16 సం॥
చదువు :10వ తరగతి
హాబీలు : కథలు చదవడం, డ్రాయింగ్ వేయడం, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా: బి.గోపాల్, 10వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, దిగవల్, మాల్‌కోనీర్, మెదక్-502321.

పేరు: ఎస్.అశోక్‌కుమార్,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : కవితలు రాయడం, పాడడం, ఆడడం, ప్రజాశక్తి పేపరు చదవడం.
పూర్తి చిరునామా : ఎస్. అశోక్‌కుమార్, సన్నాఫ్ సుబ్బారావ్ (అటెండర్) దుంబ్రిగూడ, విశాఖ.



కుక్క-గాడిద

వారణాసిలో ధారకమల్లుడనే రజకుడు వుండేవాడు. అతను పగలల్లా బట్టలుతికి అలసిపోయి ఇంటికి రాగానే గుర్రుపెట్టి నిద్రపోయేవాడు.

ఓరోజు రాత్రి అతని ఇంట్లో దొంగలు పడ్డారు. ఆ విషయం వాకిట్లో వున్న కుక్కతోపాటు గాడిద కూడా గమనించింది.

"లోపలికి దొంగ పోతున్నాడు. చూశావా?" అంది గాడిద కుక్కతో.

"చూశాను"

"అయితే మొరగవేం?"

"నా గురించి నీకెందుకు?"

"మన యజమాని ఇల్లు కొల్లగొట్టుకుపోతుంటే చూస్తూ ఊరుకోవచ్చా?" అంది గాడిద.



"నీకేం తెలుసు? రాత్రింబవళ్లు నిద్రాహారాలు లేకుండా ఈ ఇంటికి కాపలా కాస్తున్నాను. అయినా ఈ యజమానికి నా మీద విశ్వాసం లేదు. పట్టెడన్నం కూడా పెట్టడంలేదు. అలాంటి యజమాని కోసం సేవ చేయడం కన్నా ఊరుకోవడం ఉత్తమం!" అంది కుక్క.

ఆ మాటలు విన్నాక గాడిదకెంతో కోపం వచ్చింది.

"యజమాని ఇబ్బందిలో వున్నప్పుడు ఆదుకోలేని సేవకుడువున్నా ఒకటే. లేకపోయినా ఒకటే. సరే! నువ్వు అరవకపోతే నేనే ఆ పని చేస్తాను" అంటూ గాడిద గట్టిగా ఓండ్ర పెట్టింది.

ఆ గాడిద అరుపులు విని యజమానికి నిద్రాభంగమయ్యింది. పట్టలేని కోపంతో బడితె పుచ్చుకుని గాడిదను కొట్టాడు. అది చచ్చిపోయింది. తనకుమాలిన పనిని పైన వేసుకుంటే ఇదే జరిగేది" అంటూ కుక్క-గాడిద కథ ముగించాడు కరటకుడు.

ఆ తర్వాత "అందుకనే మృగరాజు దగ్గరకుపోయి దయ సంపాదించటం వ్యర్థం అని నేను అంటున్నాను. ఆయన నన్ను పెట్టిన కష్టాలు తలచుకుంటేనే కడుపు మండుతోంది. అటువంటి రాజును పూజించడం అవివేకం. దమనకా! నీకు ఇతరుల చేత చెప్పించుకోవలసిన అవసరం లేదు. నీకు ఏది మంచిదనిపిస్తే అది చెయ్యి. ఇంతకీ ఏం చేయదలచుకున్నావు?" అన్నాడు కరటకుడు.

"నేనిప్పుడు రాజు దగ్గరకుపోయి అతనికి నచ్చేలా మాట్లాడి మన్ననలు పొందుతాను" అన్నాడు దమనకుడు.

"రాజు దగ్గర కొలువు చేసే వారికెంతో మెలకువ కావాలి. వారి మనస్సునుబట్టి మాట్లాడాలి!" అన్నాడు కరటకుడు.

దమనకుడు కరటకుని సూటిగా చూశాడు. "కరటకా! ఉద్యోగికి దూర ప్రాంతం, విద్వాంసునికి పరదేశం, ప్రేమగా మాట్లాడేవారికి శత్రువులూ వుండరు. అలాగే బుద్ధిమంతునికి అసాధ్యం అనేది వుండదు. అలాంటి బుద్ధిమంతులు రాజు ఆదరణను పొందుతారు. చూస్తుండు, నేను రాజుగారి దగ్గరకు పోయి, ఆయన భయాన్ని పోగొట్టి మన్ననలు పొంది వస్తాను!" అన్నాడు దమనకుడు. "మంచిది" అన్నాడు కరటకుడు.

దమనకుడు వెంటనే పింగళకుని దగ్గరకు వెళ్లాడు. వినయంగా నమస్కరించాడు. "ఓహో! నీవా దమనకా! నిన్ను చూసి చాలా కాలమైంది. క్షేమమా? ఇప్పుడు ఏ పని మీద వచ్చావు?" అని అడిగాడు మృగరాజు పింగళకుడు.

"ప్రభూ! మీ దయ వలన క్షేమంగానే వున్నాను. తమరు నదిలో నీళ్ళు తాగడానికి వచ్చి అలాగే నిలబడిపోయారు. అందుకు కారణమేంటో తెలుసుకోవచ్చా?" అన్నాడు దమనకుడు.

"దమనకా! నీవు బుద్ధిమంతుడివి. సమయానికి వచ్చావు. నీళ్ళ కోసం నేను వెళ్తుంటే ఏదో పెద్ద శబ్దం వినిపించింది. నాకంటే గొప్ప జంతువు ఏదో అడవిలో ప్రవేశించినట్లుంది. దాని వల్ల నా రాజ్యాధికారానికే ముప్పు వస్తుందని భయపడుతున్నాను" అన్నాడు పింగళకుడు.

"శబ్దం విని అది గొప్ప జంతువనుకోవడం పొరపాటు. పిట్ట కొంచెం - కూత ఘనం అన్నట్లు జంతువు చిన్నదైనా అరుపు పెద్దగా వుండొచ్చు కదా! ఆ మాత్రానికి భయపడ్డారా ప్రభూ? అధైర్యమే అన్ని ఆపదలకు కారణం. దీనికి సంబంధించిన కథ చెబుతాను వినండి!" అన్నాడు దమనకుడు.అదేంటో వచ్చేవారం తెలుసుకుందామే.

'కల్లెడ' సంస్కృతి అంతటా వ్యాపించాలి

ఒకనాడు తెలంగాణ ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీకైన వరంగల్ జిల్లాలోని ఒక కుగ్రామంలో నాటి దొరల తాజాతరం నాటి బడుగు జీవుల నేటి తరంలో విద్యాజ్యోతి వెలిగిస్తున్న వైనం. కల్లెడలో చదువుకొని విదేశాలలో స్థిరపడిన వారు మాతృభూమి రుణం తీర్చుకునేందుకు నెలకొల్పిన ఈ విద్యాలయంలో విద్యార్థులంతా కూలీనాలీ చేసేవారి పిల్లలే.

చుక్కా రామయ్య

ఇవి పాఠశాలలు, కళాశాలలు వార్షికోత్సవాలు జరుపుకునే రోజులు. కొందరికి ఇవి వినోద కార్యక్రమంగా కనిపించవచ్చునేమో గానీ, విద్యార్థులకు, అధ్యాపకులకు, ఆ విద్యాసంస్థలకు మరపురాని రోజులు. విద్యార్థికి ఒక్కో సంవత్సరం ఒక్కోమెట్టులాంటిది. ఒక్కో మెట్టు ఎక్కే కొద్దీ అనిర్వచనీయమైన అనుభూతి పొందటం వారి లక్షణం. వార్షికోత్సవం అలాంటి ఆనందాన్ని రుచి చూపటమే గాక మరెన్నో లక్ష్యాల కోసం ఉద్దేశించింది. విద్యా సంస్థలు తాము ఆ విద్యా సంవత్సరంలో చేసిన వివిధ కార్యక్రమాలను తల్లిదండ్రుల ముందుంచటం, రాబోయే విద్యా సంవత్సరంలో ఏం చేయదలచుకున్నదీ తెలిపి ఆమోదం పొందటం ఆనవాయితీ. ఇదెంతో ప్రజాస్వామిక సాంప్రదాయం. ఇక విద్యార్థులు తాము నేర్చుకున్న అనేక విద్యలను ప్రదర్శిస్తారు. తమ ప్రతిభకు గుర్తింపుగా బహుమతులు అందుకుంటారు. కొందరు తమ పాఠశాలకు వీడ్కోలు పలికితే మరికొందరు ఆ పాఠశాలలో చేరేందుకు ఉద్యుక్తులవుతారు. ఇలా విద్యార్థులు వార్షికోత్సవాన్ని తమ జీవితాల్లో మరపురాని రోజుగా గుర్తుంచుకుంటారు. ఈ నేపథ్యంలో నేను ఒక పల్లెటూరు పాఠశాలకు వెళ్ళటం తటస్థించింది. వరంగల్ జిల్లాలోని ఆ గ్రామం కల్లెడ. ఒకనాడు భూస్వామ్య వ్యవస్థకు, ఫ్యూడల్ వ్యవస్థకు కేంద్రమిది. నాటి 'గడి' (దొరల గృహం) ఈనాటి 'బడి'. ఆ రోజులలో మాల, మాదిగలు ఆ అధికార దర్పానికి తలలు వంచి పని మనుషులుగా జీవితాలు గడిపిన ఇల్లు అది. నేడు... అదే సంతతికి చెందిన పిల్లలు తిరుగాడుతున్న విద్యాలయం. ఆనాడు ఆ భవనం కేంద్రంగా దొరలు ఊరు ఊరునంతా శాసించేవారు. నేడు ఆ దొరల సంతతి విద్యాదాతలు. ఈ ఐదు దశాబ్దాల కాలంలో ఎంత మార్పో! భూస్వామ్య వ్యవస్థకు, ఫ్యూడల్ వ్యవస్థకు, వారి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన నాకు ఆ మార్పును చూస్తుంటే కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

కల్లెడ, నాడు పేరొందిన భూస్వామ్య కేంద్రం, ఆ భూస్వామి కుటుంబం పాలనాయంత్రాంగంలో కీలక స్థానంలో ఉండేది. వారి పిల్లలు డూన్, లారెన్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అలా మాతృదేశానికి, వేలమైళ్ళ దూరంలో వున్నా, మాతృభూమిని మరవలేదు. తమ ఉన్నత స్థితికి కారణం తమ తల్లిదండ్రుల కన్నా, ఆ ఊరు, అక్కడి శ్రమజీవులేనని భావించారేమో! వారి రుణం తీర్చుకోవాలని ఆశపడ్డారేమో! తమ ఉన్నతికి తోడ్పడిన శ్రమజీవులకు కృతజ్ఞతలు చెప్పాలని తపించిన వారు 'కల్లెడ రూరల్ ఎడ్యుకేషన్ సొసైటీ' పేరుతో ఒక సంస్థను స్థాపించి విద్యా, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.


నాటి అధికార పీఠం
నేటి విద్యాలయం

తమ తాతముత్తాతలు, తల్లిదండ్రులు అధికార కేంద్రంగా చేసుకున్న 'గడి'ని బడిగా రూపుదిద్దాలని నిర్ణయించి అక్కడొక 'బడి'కి ఊపిరిపోశారు. బడిని ప్రారంభించి నడపడమే కాదు మరో అడుగు ముందుకు వేసి బడికి జవసత్వాలిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి బడిలో పిల్లలను చేర్పించమని అడిగి, బడికి తీసుకొస్తున్నారు. అందుకే 80 మందితో ప్రారంభమైన ఆ బడిలో నేడు 450కి పైగా విద్యార్థులున్నారు. పిల్లలను బడికి పంపటానికి తల్లిదండ్రుల పేదరికం ఆటంకమైతే, దానిని అధిగమించేందుకు నిర్వాహకులు నెలనెలా తల్లిదండ్రులకు కొంత డబ్బును ఎదురిచ్చి మరీ పిల్లల్ని రప్పిస్తున్నారు. ఆ బడుగు జీవులు మనియార్డర్‌లను ఏ కొడుకునుంచో, కూతురునుంచో గాక, తమ పిల్లలను బడికి పంపినందుకు అందుకోవడం విశేషం. వైద్యసాయం, జీవన భృతి కోసం కూడా ఈ 'ట్రస్టు' పాటుపడుతున్నది. పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు ఇవ్వడమే కాక మధ్యాహ్న భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. ఒకనాడు భూస్వాముల ఉక్కుపాదాల కింద నలిగిన ఆ ఊరి వారి సంతతి నేడు అదే స్థానంలో విద్యాలయంలో స్వేచ్ఛా విహంగాల్లా చదువుల ప్రపంచంలో విహరించడం గొప్ప సామాజిక మార్పు.

హైదరాబాద్‌లోని ఆంధ్రమహిళా సభ బి.ఇడి. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి మార్గదర్శకత్వంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంతో అంకిత భావంతో పని చేస్తుండటం కనిపించింది. బడికోసం పది ఎకరాల మాగాణి పొలం కూడా విరాళంగా ఇచ్చారు. అందులో పంట పండించేది విద్యార్థులే! ఇలా శ్రమను,

చదువును కలిపి ఒకే ప్రాంగణంలో చూడటం అరుదు. ఆ పిల్లల సాంస్కృతిక నేపథ్యం దృష్టిలో ఉంచుకొని, వారిని శ్రమ నుంచి దూరం చేయకపోవటం విశేషం. మంచి సూచనలు, సలహాల కోసం వారం వారం హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి అనుభవజ్ఞులను రప్పించి కొన్ని ప్రత్యేక తరగతులు చెప్పిస్తున్నారు.

అలా ఒక వినూత్న రీతిలో ఏర్పాటైన కల్లెడ పాఠశాలలో విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేయాల్సిందిగా నన్ను కోరటంతో, ఆ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. ఒక్కో విద్యార్థికి హాల్ టికెట్‌ను ఇస్తుంటే ఒక్కో అనుభూతి కలిగింది. కూలీ, నాలీ చేసుకుంటూ తమనే ఆశాజ్యోతులుగా చూసుకుంటూ తమ తల్లిదండ్రులు తమను పాఠశాలకు పంపుతున్నారని వారి ఆశలకు సార్థకత చేకూర్చాలని ఆ పిల్లలు తపన పడటం కనిపించింది. హాల్‌టికెట్ తీసుకోవడం, ఒక దీక్ష తీసుకోవటంగా ఆ పిల్లలు భావించారు. ఒక ఫ్యూడల్ వ్యవస్థలో ఇంతటి మార్పు రావడాన్ని చూసి ఒకింత ఆశ్చర్యం కలిగింది నాకు. నాటి భూస్వామ్య కేంద్రాలుగా, అధికార కేంద్రాలుగా వెలిగిన భవనాలను నేడు చూడాలంటేనే జుగుప్స కలిగే నాకు, వాటి యెడల ఒక ఆరాధనా భావం ఏర్పడింది.

వరంగల్‌లోనే గాక నైజాం కాలంలో తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో భూస్వాములు రాజ్యమేలారు. వారి దాబుకు, దర్పానికి సాక్షీభూతాలుగా మిగిలిన నాటి భవనాలు అన్నింటినీ విద్యాలయాలుగా మారిస్తే బాగుంటుంది. 'కల్లెడ' వలెనే మిగతా చోట్ల కూడా విద్యాలయాలు వెలిస్తే, ప్రతీ గడీ, బడి అయితే ఫ్యూడల్ వ్యవస్థకు పునాదియైన తెలంగాణ ఆధునిక భావజాలానికి, వైజ్ఞానిక రంగానికి పుణ్యక్షేత్రంగా కాకుండా పోతుందా? ★

(9వ పేజీ తరువాయి)

అమెరికా అమ్మాయి

అవతలపడటం చూసి వెళ్ళి దాన్ని తీసుకొని ముద్దుపెట్టుకుంది. చేతికి పెట్టుకొని దానివంక చూస్తూ అలాగే కూర్చుండిపోయింది. జిలెంటా ఏమీ మాట్లాడలేదు. ఆ ఉంగరం చూసి లీనస్ చిన్నగా ఏడుపు మొదలెట్టింది. జిలెంటా ఆమెను ఓదార్చి నా జీవితంలో మీలాంటి ప్రేమికులను చూడనేలేదు. అసలు నిన్ను, వెంకట్‌ను చూస్తుంటే నాకు అసూయగా ఉంది. బాధపడకు లీనస్. మీ ఇద్దరు కలవటానికి నేను ఏమి చేయ టానికైనా సిద్ధమే అంది. రోజులు గడిచిపోతున్నాయి. ఆమె అన్నం కూడా తినకుండా ఆలోచిస్తూ కూర్చోవడాన్ని చాలా కాలం వాళ్ళ ఫాదర్ గమనించాడు. అతను లీనస్‌తో నీవు ఆ ఇండియా వాడిని మర్చిపో. వాడేమైనా అందగాడా లేక ధనికుడా. నేను చెప్పేది విను. నీకు వాడికన్నా అందమైన యువకునితో పెళ్ళి జరిపిస్తా అని ఎంత బ్రతిమలాడినా ఆమె అంగీకరించ లేదు. మొండికేసి భోజనం చేయడం లేదు.



ఇక్కడ వెంకట్ జిలెంటా ఇచ్చిన లీనస్ ఫొటోను చూసుకొంటూ ఎలాగో కాలం గడుపుతున్నాడు. అథ్లెటిక్స్‌లో ఆంధ్రకు ప్రాతినిధ్యం వహించాలనే అతని కోరిక నెరవేరింది. అతనిని 100 మీ. పరుగు పందెంలో ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపిక చేశారు. ఇండియా స్థాయిలో మీట్‌ను గుజరాత్‌లో నిర్వహించారు. సాహసమే ఊపిరిగా పోరాడు తున్న వెంకట్ ఆ మీట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. అది చూసిన సెలక్టర్లు అతడిని ఒలింపిక్స్‌కు ఎంపిక చేశారు. అది జరిగేది అమెరికాలోని వాషింగ్టన్‌లో అని తెలుసుకొన్న వెంకట్ సంతోషానికి హద్దులు లేవు. ఎలాగైనా అమెరికా వెళితే ఆమెను కలుసుకోవచ్చంటూ కలలుకన్నాడు.

అమెరికాలో లీనస్ చాలా చిక్కిపోయింది. సమయానికి అన్నం తినడం లేదు. అందువలన జబ్బు పడింది. డాక్టర్లు ఆమె మానసిక ఆవేదనే ఈ రోగానికి కారణమన్నారు. ఇలాగే కొంతకాలం గడిస్తే ఆమె దక్కకపోవచ్చని చెప్పారు. ఆయన తన నిరంకుశ వైఖరికి చింతించాడు. ఇంకేమీ ఆలోచించకుండా లీనస్ దగ్గరికి వెళ్ళి ఆమె ప్రేమను అంగీరించాడు. తనను క్షమించమని కోరాడు. వెంటనే ఇండియా వెళ్ళి నీ ప్రియుడ్ని కలుసుకొమ్మని అన్నాడు. ఆమెకు కావలసిన డబ్బిచ్చి ఇండియా పంపాడు. లీనస్ సంతోషంతో ఆఘమేఘాల మీద ఇండియా వచ్చింది. వెంకట్ ఇంటికి వెళ్ళి చూసింది. పక్కనున్న వారిని అతని గురించి అడిగింది. వాళ్ళు రెండు సంవత్సరాల క్రితమే ఇంటిని విడిచి పట్టణానికి వెళ్ళారని తెలిసింది. ఎంత ప్రయత్నించినా అడ్రస్ తెలుసుకోలేక పోయింది. ఆమె మనస్సు చికాకయింది. ఇక వెంకట్‌ను జీవితంలో కలుసుకోలేననుకుంది. నీరసంతో అమెరికా బయలుదేరి వెళ్ళింది. ఇంటివద్ద తన తండ్రికి జరిగింది చెప్పింది. అతని ఫొటో ఒక్కటైనా నీ దగ్గర ఉందా అని అడిగాడు. తన ఫొటో అతని దగ్గర ఉంది కాని అతని ఫొటో తను తీసుకోలేకపోయానని చెప్పింది. తాను వేరే వ్యక్తితో జీవితం పంచుకోలేననుకుంది. చనిపోవాలని నిర్ణయం తీసుకుంది.

ఒలింపిక్స్ రానే వచ్చాయి. వాషింగ్టన్‌లో జరగబోతున్నాయి. ఇండియా తరఫున వస్తున్న బృందంలో వెంకట్ కూడా వున్నాడు. ఎలాగైనా లీనస్‌ను కలుసుకోవాలని కలలు కంటున్నాడు.

లీనస్ అథ్లెటిక్స్ అంటే పడి ఛస్తుంది. ఆ ఒలింపిక్స్ చూసి తర్వాత చనిపోవాలనుకుంది. స్టేడియం జనాలతో కిక్కిరిసిపోయింది. ఆమె దీనవదనంతో ఉంది. కొన్ని మీట్స్ అయిపోయాయి. 100 మీ పరుగుపందెం నిర్వహించబోతున్నారు. ఆ పోటీలకు అమెరికా తరఫున ఆమె అభిమాన హీరో మారిస్ గ్రీన్ కూడా వచ్చాడు. స్టేజి మీద పాల్గొనే వ్యక్తుల పేర్లు, వారి దేశాల పేర్లు చెబుతున్నారు. లీనస్ జనం మధ్య ఎక్కడో మౌనంగా కూర్చుంది. ఇండియా నుండి వెంకట్ అని చెప్పగానే ఆమె మనస్సు ఆకాశానికెగిరింది. గుండె టకటకా కొట్టుకొంది. అతడో కాదోనని ఆరాటం. జనాన్ని తోసుకుంటూ ముందుకెళ్ళసాగింది. అయినా ఇంకా దూరం ఉంది. అథెట్లు సరిగా కనిపించటం లేదు. ఇంకా ముందు కెళ్ళింది. పందెం ప్రారంభమైంది. స్టేడియం మొత్తం ఒకటే చప్పట్లు. ప్రేక్షకుల హర్షధ్వానాలతో స్టేడియం దద్దరిల్లిపోతోంది. వెంకట్ అనుకున్నది సాధించాడు. మారిస్‌గ్రీన్‌ను వెనక్కినెట్టి విజయం సాధించి, స్వర్ణం చేజిక్కించుకున్నాడు. గ్యాలరీకి దగ్గరగా వచ్చిన వెంకట్‌ను లీనస్ చూసింది. పెద్దగా పిలిచింది. వెంకట్ ఆగిపోయాడు. వాళ్ళలో లీనస్‌ను గుర్తించలేక పోయాడు. స్టేజీ మీదకు వెళ్ళాడు. జనాన్ని తోసుకుంటూ లీనస్ ముందుకు వచ్చి మరలా వెంకట్‌ను పిలిచింది. పోలీసు సిబ్బంది ఆమెను వెనక్కి నెడుతున్నారు. అది గమనించిన అతను మైక్‌లో ఆమెను పంపించమని అరిచాడు. ఇద్దరూ ఒకరినొకరు కౌగిలించు కొన్నారు. వారిని చూసి అందరూ ఒక్కసారిగా ఆశ్చర్య పోయారు. వెంకట్, లీనస్ తనను ఎలా ప్రేమించింది, వారు ఎలా విడిపోయిందీ, తాను ఎటువంటి స్థితిలో ఉంది అంతా వివరించాడు. ప్రస్తుతం నేను ఈ స్థానంలో ఉన్నానంటే అది లీనస్ ఇచ్చిన ప్రేరణేనని చెప్పాడు. తనను ఇంత గొప్పవాడిని చేసింది ఆమేనన్నాడు. వారి ప్రేమకథ విన్న జనాలు హర్షధ్వానాలతో అక్కడే వారి పెళ్ళి జరిపించారు. ★

తగునా ఇది నాథా?

గల్లీ రవుడీలు కొందరుంటారు!

నాలుగైదు వీధుల్ని వాళ్ళు తమ రాజ్యంగా ప్రకటించుకుంటారు!

ఆ రాజ్యంలో వారు పరమవీర కిశోరాలుగా పిలిపించుకుంటారు. మకుటం లేని మహారాజులల్లె చలామణి అవుతుంటారు!

వాళ్ళు చెప్పిందే వేదమంటారు!

వినకపోతే నెత్తురు వరదలవుతుందని బోర్డులు తగిలిస్తారు!

తమ రాజ్యంలో వాళ్ళకి తిరుగుండదు!

బడ్డీ కొట్లలో - బీడీలూ కారాకిళ్ళీలూ వాళ్ళకి ఫ్రీగా దొరుకుతాయి. కిరాణా దుకాణాల్లో వెచ్చాలు కూడా ఫ్రీగానే కట్టించుకుంటారు!

లక్ష్మి

గల్లీ రవుడీలు తమ గల్లీల్లో పర్యటిస్తున్నప్పుడు-

మామూలు జనం తప్పుకు నడిస్తే క్షేమంగా వుంటారు. చేతులు జోడిస్తే మరింత క్షేమంగా వుంటారు!

అట్లాంటి గల్లీ రవుడీ తమ రాజ్యాన్ని విడిచి పక్క రాజ్యానికెళ్ళినప్పుడు మాత్రం కొంత అసౌకర్యానికి గురవుతూ వుంటాడు. అక్కడి ప్రజలకి అతనెవరో తెలీని కారణంగా అతన్ని లక్ష్య పెట్టరు!

అక్కడకూడా రవుడీగారు రొమ్ము విరుచుకు నడిస్తే రూలొప్పుకోదు. ఆకతాయి పిల్లవాడు రాయిచ్చుకొట్టినా అడిగే వారుండరు!

అదట్లా వుంచండి!

రవుడీలక్కూడా ప్రమోషన్లుంటాయి!

గల్లీలను గడగడలాడించే అనుభవం ముదిరిపోతే - గల్లీ రవుడీ బస్తీ రవుడీ స్థాయికి ఎదుగుతాడు. బందరు రవుడీ... తెనాలి రవుడీ అని ఊరుపేరునే ఇంటి పేరుగా చేసుకుంటారు!

ఆ స్థాయి కూడా దాటిపోతే జిల్లా రవుడీ అవుతాడు. ఆ పైన స్టేట్ రవుడీగా పేరు తెచ్చుకుంటాడు!

టూకీగా రవుడీల ప్రోగ్రెస్సు వివరించడం జరిగింది!

గల్లీ రవుడీ... బస్తీ రవుడీ... జిల్లా స్టేటు రవుడీల మాదిరి ఇళ్ళల్లో కూడా రవుడీలుంటారు!

ఈ రవుడీలు రవుడీల్లాగా కనిపించరు!

ఈ రవుడీలను చూస్తే రవుడీలనుకోరు!

ఎంతో బుద్ధిమంతులనుకుంటారు. గొప్ప మర్యాదస్తులనుకుంటారు. ఇతరులు యావన్మందీ ఆ విధంగా అనుకునేందుకు వీలుగా "ఇంటి రవుడీ"లు

వృద్ధులు కనిపిస్తే చేతులు జోడిస్తారు!

ఆడవాళ్ళు ఎదురైతే తలొంచుకు నడుస్తారు!

అసలు సిసలు రవుడీలకు ఇల్లాంటి ఏర్పాట్లు గిట్టుబాటు కాదు! మంచితనం మర్యాదలు నటిస్తే వాళ్ళు బతకలేరు!

అందువల్ల-

మేము రవుడీలమని ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తేనేగాని వాళ్ళ వ్యాపారం సవ్యంగా సాగదు!

'ఇక్కడ పులి వుంది' అని బోర్డు చూసి-

ఆ దారి వెళ్ళకుండా జాగ్రత్త పడతాం!

'మహర్షి ఆశ్రమానికి దారి' అనే బోర్డు చూసి-

పళ్ళూ పూలతో ఆ దార్లో అడుగుపెడతాం!

రవుడీలు ఎంతోకొంత నిజాయితీపరులు గనుక - పులిబోర్డు రవుడీలే కట్టుకుంటారు. ఆ హెచ్చరిక చదివి మనం తగిన జాగ్రత్తలు తీసుకుంటాం!

ఇంటి రవుడీలు మాయకు మరోపేరు గనక - మహర్షి బోర్డు తగిలిస్తారు. నమ్మి వెళ్ళినందుకు మనల్ని కడుపు నిండా భోం చేస్తారు!

నమ్మించి భోం చేయడమనే కార్యక్రమానికి పెళ్ళి చూపుల్లోనే శ్రీకారం దిద్దుతారు. పెళ్ళి చూపులకొచ్చిన పెళ్ళి కొడుకు ఎంతో సంస్కారమున్న మనిషల్లె కనిపిస్తాడు!

ఎంతవరకు చదువుకున్నారని పెళ్ళికూతుర్ని ఆడుగుతాడు!

హైస్కూలు చదువుతో ఆపేసేనంటే - ఆడపిల్లకి ఆపాటి చదువుచాలంటాడు. ప్రైవేటుగా డిగ్రీ చేసేనని చెప్పినప్పుడు - ఆడపిల్లకి చదువే గొప్ప అలంకారమంటాడు!

తనకి కట్న కానుకల మీద ఇంట్రెస్టు అస్సల్లేదంటాడు!

కట్నం పుచ్చుకునే మగవెధవని చెప్పుతో కొట్టాలంటాడు. గురజాడ అప్పారావులాటి సంఘ సంస్కర్తలు ఇవాళ సమాజానికి చాలా అవసరమంటాడు!

కన్యాశుల్కానికీ వరకట్నానికీ తేడా తెలీకుండా మినీ లెక్చరిస్తాడు!

పిల్లవాడు చాకులాగా వున్నాడని ఆడపిల్ల వాళ్ళ మెప్పు పొందుతాడు. కాబోయే మావగారి బేంకు బేలెన్సుమీద తన కన్ను పడ్డట్టు మాత్రం ఆడపిల్ల వాళ్ళకి తెలీకుండా జాగ్రత్త పడతాడు!

పెళ్ళయింతర్వాత -

అయ్యగారి అసలురంగు స్టేజీల వారీగా తెలుస్తూ వుంటుంది!

కట్నం అడగని బుద్ధిమంతుడనే ముసుగులో 'కానుకల' పేరిట స్కూటర్లు, కార్లు, లారీలు కావాలని ఇండెంట్లు పెడుతూ వుంటాడు!

ఆ ఇండెంట్ల తయారీలో తన ప్రమేయం లేనే లేదంటాడు. అవన్నీ ఎప్పటికప్పుడు తన భార్య మాత్రమే తయారు చేస్తోందని ప్రకటిస్తూ వుంటాడు! ఆవిడ ముచ్చటకి బ్రేకులు వేసే ధైర్యంగానీ చొరవగానీ తనకు లేదని చెబుతుంటాడు!

అతని కోరికల గుర్రాలకు కళ్ళేలుండవు!

మావగారి గుండెల మీద జోరుగా పరుగెడుతుంటాయి!

ఆ పరుగుల్లో-

మావగారి గుండె అలిసిపోతుండగా వారి బేంకు బేలెన్సు కూడా తరిగిపోతూ వుంటుంది!

పచ్చటి పుట్టిల్లు తన పెళ్ళి మూలంగా వెచ్చటి కన్నీటితో మునిగిపోతోందని తెలుసుకున్న అతివ - తన భర్త తాలూకు దయమాలిన చర్యలకు కలత పడుతుంది. తగునా ఇది నాథా అని అడగవలసిన మాట - అతని ధూంధాంల హోరులో వినిపించదనే ఉద్దేశంతో గొంతులోనే వుండిపోతుంది! ★

'హైటెక్-స్టార్‌ట్రాక్'



రుక్మిణి

"అమ్మా.... మీరు మాకు సాయం చెయ్యాలె... తప్పదు.. కష్టాల్లో వున్నాం... కనికరించాలి–" పచ్చబాబు కన్నీళ్ళయితే పెట్టుకోలేదుగానీ కాళ్ళా వేళ్ళా పడి బతిమిలాడుకుంటున్నాడు.

ఎదురుగ్గా అప్పటికే రెండుసార్లు ఆవిలించి, మూడుసార్లు ఒళ్ళు విరుచుకుని అవయవ సౌందర్యాన్ని వివిధ భంగిమల్లో మూడుసార్లు ప్రదర్శించి, ఓసారి ఓరగంట కన్ను గీటింది. ఆ కన్ను గీటు కోసవే కసిదీరా కాసుకున్న ఆ తారామణి అమ్మగారైన చింతామణిగారు తన నడుముకున్న బంగారు వడ్డాణాన్ని, తలలోని వాడని పూలనీ ఓసారి సర్దుకుని సోఫా నిండుగా కూలబడి సకిలించింది.

"మీరెన్నయినా సెప్పండిబాబూ... అమ్మాయికి ఇవాళ రాత్రికి కుదర్దు... ఏం బేబీ... ఆ బొంబైవాండ్ల కాలుషీట్లు ఇవ్వాళ్ళేగదా... ఫ్లైయిటు టికట్లు కూడా పంపినంట్రుండ్రు... మీరంతగా కావాల్నంటే రేపైతే వీలయితది – అదీ ఓ రెండు గంటలు మధ్యాన్నమైతే మరీ మంచిది – ఫైవ్‌స్టార్ లేంది లాభం లేదు...

బాబుగారు హతాశుడై తల టేబిలుకేసి లపలప బాదుకున్నాడు. సోమయ్య అదిరిపడి నాలుగు లొటికెలేశాడు.

"చూడండి బానూ... అంత అవసరమనుకుంటే బొంబై వాళ్ళని తొంభై రోజుల్దాకా ఆపేస్తాను... ఇంతకూ లొకేషనూ... హోటలూ....

బాబుగారి గొంతు తడారిపోయింది. నిబాయించుకున్నాడు. సోమయ్య గుటకేసి గొంతు సవరించుకున్నాడు.

"మేం వచ్చింది దానిక్కాదమ్మా... సిన్మాలేదు.. 'పాదూ' లేదుగానీ... రేపు మన దేశ, రాష్ట్ర ఎన్నికల్లో మా తారామణిగారికున్న అద్భుత పేరు గ్లామరు – ప్రభావంతో మా పార్టీకి సహకరించి మాకు ఓట్లను సంపాదించిపెడితే ఈ జన్మాంతం మీకు రుణపడి వుంటాం!" సోమయ్య పాఠం లటలటమని అప్పజెప్పేశాడు. తారామణి కాలు మీద కాలు విలాసంగా వేసి విలాసంగా నవ్వింది.

"అదేంటి సార్... మా మమ్మీదీ... నాదీ... మా పి.ఏ.వీ... తోటమాలిదీ కారు డ్రైవరుదీ అన్ని ఓట్లూ మీ పార్టీకి వేస్తాం – సరేనా..." అని మరొక్కసారి ఒళ్ళు విరుచుకుంది. బాబుగారు మళ్ళీ తల లపలపమని టేబిలు కేసి బాదుకున్నాడు. సోమయ్య ఓదార్చాడు.

"అమ్మాయెూ... నేనో రెండు ప్రశ్నలడుగుతాను – సూటిగా సమాధానం చెప్పమ్మా... నువ్వీ సినిమా రంగంలోకి రాకపోయినట్లయితే ఏం చేసేదానివి?"

"డాక్టర్నయ్యేదాన్ని – పేదప్రజలకు నా ప్రాణాన్ని... రక్తాన్ని ధారపోసి ఆదుకునే దాన్ని – నా దేశభక్తిని నిరూపించుకునేదాన్ని... నాకు దేశమన్నా... బాక్సాఫీసు హిట్లన్నా... కొత్తకుర్రకారు హీరోలన్నా... హోండాకార్లన్నా వెర్రి అభిమానం... వాటి కోసం నా ప్రాణాలర్పిస్తాను....

ఆవిడ అట్లా రెచ్చిపోయి ఒంటిమీద సోయ లేకుండా అరగంట దాకా వాయించింది. వాళ్ళ మమ్మీ విప్పారిన నేత్రాలతో విశాలమైన వడ్డాణాన్ని సవరించుకుంటూ – వింటూ కూచుండి పోయింది. సోమయ్య మెదట్లో మొనళ్ళు తోకలాడిస్తున్నాయి.

"సర్సరె... ప్రస్తుతం మా పార్టీ మాత్రమే ఇన్నాళ్ళు పరిపాలించి ఈ రాష్ట్రాన్ని... ముఖ్యంగా డ్వాక్రా మహిళల్ని ముందుకు ముందుకు తీసుకుపోయింది – వాళ్లింకా ముందుకు పోవాలంటే నీ సహకారం... అవసరం! వాళ్ళను చైతన్యంలో నింపి రాజకీయంగా బాగా ఎదగనివ్వాలి...

"మరినన్నేం చేయమంటారో చెప్పండి... డాన్సులేమైనా చేయాలన్నా.. మా మమ్మీతో మాట్లాడండి!"

"నువు డాన్సులేమీ చేయొద్దు... బట్టలేం విప్పద్దు... అట్లా ఆ బహిరంగ సభల్లోకి వచ్చి కూర్చుని నాలుగు మాటలు మా పార్టీ గురించి చెబితే చాలు... అంతే!"

"దేశ సేవంటే నాకు ప్రాణం... రాష్ట్ర ప్రయోజనం... బడుగు జనాల అభివృద్ధి అంటే అంత సింపులేనా... సర్సరె... సంతోషం... ఇదెంతపని... మరీ ఇంతగా అయితే మేం తలా ఒక పార్టీ పెట్టి దేశ సేవకు తగులుకుని తరించే వాళ్ళం... అయ్యో....

తారామణి నటజీవితానుభవంలో నుండి... పడిన కష్టాల పరంపరల వ్యధ నుండి... ఆవేదన నుండి వచ్చిన ఆ రెండు మూడు ప్రశ్నలకు ఇచ్చిన జవాబులు విని బాబుగారు నాలుగైదుసార్లు తలబల్లకేసి బాదుకోవాల్సి వచ్చింది.

"అహహఁ... రేపుగాని మీరు కోరితే ఒక అసెంబ్లీ సీటో... పార్లమెంటు సీటో కూడా కేటాయిస్తాం... మీ అద్భుత గ్లామరుతో జనాల్ని వెర్రి వెధవల్ని చేసి మీరు గెలిచి మమ్మల్ని గెలిపించవచ్చు...

"ఆగండాగండి... మరి దీనివల్ల మాకు ఒరిగిందేముందీ.. ఇపుడెట్లాగూ అటు మీ అపోజిషను వాండ్లు కూడా వచ్చిపడతారు. కాల్షీట్లు అడుగుతారు – రేటు నిర్ణయం జరుగుతుంది – ఏమీ ఆశించకుండా ఏ 'పని' పడితే ఆ పని చేయడానికి మా అమ్మాయేం వెర్రిది కాదు... వెళ్ళండి...

సోమయ్య వుక్కిరి బిక్కిరయ్యాడు – ఓ సూటుకేసు తీసి గుంభనంగా టేబిలు మీద పెట్టాడు. "చూడమ్మాయ్... ఇది అడ్వాన్సు... ఇవి కాగితాలు... రేపు మా పార్టీ సినీ నిర్మాతలు తీయబోయే అయిదారు సినిమాల్లో హీరోయిను అగ్రిమెంట్లు... సంతకాలో... వేలి ముద్రలో గుద్దిపారెయ్!"

తారామణి మొహం ఆనందంతో వెలిగిపోయింది.

"ఓ.కె. పెద్దలు... అసలు నేను పుట్టకముందు నుండీ మీ పార్టీ కార్యకర్తనే సుమా... మా కుటుంబం మొత్తం మన పార్టీకే సేవలు చేసి తరించిపోయారు. నా జీవితాంతం మన పార్టీకే ధారపోస్తాను–" అన్నట్లు ఈ డైలాగులు సరిపోతాయి గదా... ఓ పది మీటింగులు ఏర్పాటు చేసుకోండి – హెలికాప్టరోటి పంపించండి – మీరు కోరిన రేవులో ప్రత్యక్షమైపోతాను..

సోమయ్య బ్రహ్మానందపడిపోయాడు – బాబుగారి ఆనందానికి హద్దుల్లేవు – సినీ గ్లామరుమరి–

నీతి : దేశం సినీగ్లామరుతో ధగధగా మెరిసిపోతుంది – జనం సినిమా తారల ఒంపుసొంపుల్ని చూసి 'ఫీల్‌గుడ్' అన్న అద్భుత భావాన్ని నిత్యం జపించుకుంటారనుకుంటున్నారు – ఏలుతున్న వారు!

★

ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా



'మలేరియా అన్న పదాన్ని వినని వారు, దోమకాటుకు గురి కాని వారు ఉండరు' అంటే అతిశయోక్తికాదు. ఒక చిన్న ఆడ అనోఫిలిస్ దోమకాటుకు గురై పెద్ద సంఖ్యలో జనాభా వ్యాధిగ్రస్తులై, ఎంతోమంది మరణిస్తున్నారు. నేటి ప్రపంచంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం సంవత్సరానికి **500** కోట్ల కేసులు ప్రపంచంలో నమోదవుతుండగా అందులో **10** నుండి **30** లక్షల రోగులు ప్రతి సంవత్సరం మరణిస్తున్నారు. ఉష్ణ ప్రదేశాల్లో ఎక్కువగా ఇది వస్తుంది.

డాక్టర్ నాగినేని భాస్కరరావు

పరాన్న జీవులను తగినంత స్థాయిలో నిరోధించకపోవడం, దోమల నివారణ తగిన స్థాయిలో లేకపోవడం, పరాన్న జీవులు మందులకు లొంగకపోవడం, ప్రభుత్వాలు సరైన ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టకపోవడం, ప్రజల్లో చైతన్యం లేకపోవడం, మారుతున్న వాతావరణ పరిస్థితులు, నివారణ పథకాల్లో అనేక స్థాయిల్లో అనేక అవకతవకలు తిరిగి మలేరియా ప్రబలటానికి కారణాలు.

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చి 57 సంవత్సరాలు గడిచినా జాతీయ మలేరియా నిర్మూలన పథకాన్ని ప్రభుత్వం 1958లోనే ప్రవేశ పెట్టినా దేశంలో మలేరియా సమస్య తీవ్రంగా వుంది. ఒరిస్సా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో మలేరియా బాగా వుంది. 68 శాతం భారతదేశపు కేసులు ఈ రాష్ట్రాల్లోనే వున్నాయి. 1958 నుండి 1962 వరకు ఎన్‌ఎమ్ఇపి పనితీరు ఫర్వాలేదు. 1962లో కేవలం ఒక లక్ష కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఆ తరువాత కేసులు క్రమంగా పెరిగాయి. 1977లో భారత ప్రభుత్వం మోడిఫైడ్ ప్లాన్ ఆఫ్ ఆపరేషన్‌ను చేపట్టింది.

చరిత్ర : మనిషికి ఇది చాలా పురాతనమైన జబ్బు. చరిత్రకు పూర్వం రోజుల్లో కూడా మానవజాతి ఈ మలేరియా బారిన పడింది. గొప్ప భారతదేశ ఆయుర్వేద వైద్యులైన చరకుడు, శుశ్రూతుడు మలేరియాను 'జబ్బుల రాజు'గా వర్ణించారు. ఇది సరైన వర్ణన. ఎందుకనగా మలేరియా రోగిలో విభిన్న తత్వాలు గల వివిధ లక్షణాలను కలిగి వుండి అనేక వ్యాధులను అనుకరిస్తున్నట్లుంది. మలేరియా అన్న ఇటాలియన్ పదానికి 'చెడ్డగాలి' అని అర్థం. 1880వ సంవత్సరంలో ఒక ఫ్రెంచి మిలిటరీ సర్జను మలేరియాకు కారణమైన పరాన్న జీవిని కనుగొన్నారు. 1894లో మాసన్ అనే అతను మలేరియా వ్యాప్తికి దోమకారణమని ప్రతిపాదనలు చేశాడు. 1897లో ఇండియాలోని హైదరాబాద్‌లో సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాప్తి లేక ప్రసారానికి ఆడ అనోఫిలిస్ దోమ కారణమని నిరూపించారు. ఈ మలేరియా గురించి ఈ వ్యాసంలో ఇంకా కొన్ని విషయాలను స్థూలంగా తెలుసుకుందాం.



ఎలా కలుగుతుంది ?

మలేరియా, ఆడ అనోఫిలిస్ (వ్యాధిగ్రస్తమైనది) దోమకాటు (లేక రక్తం పీల్చే సమయంలో) ద్వారా మనిషి రక్తంలోకి ప్రవేశ పెట్టబడిన జీనస్ ప్లాస్మోడియం అనబడు అతి చిన్న పరాన్నజీవి ద్వారా కలుగుతుంది. మనిషి, దోమ ఒకటి వెనుక ఒకరు రోగమును అంటించుకుంటారు. నాలుగు రకాలైన జీనస్ ప్లాస్మోడియం పరాన్న జీవి మనిషిలో మలేరియా వ్యాధిని కలిగిస్తాయి. అవి

1) ప్లాస్మోడియం ఫాల్సిపారం
2) ప్లాస్మోడియం పైవాక్సు
3) ప్లాస్మోడియం ఓవేల్ (ఇది ఇండియాలో లేదు)
4) ప్లాస్మోడియం మలేరియా

అయితే దాదాపు మరణాలన్నీ ప్లాస్మోడియం పాల్సిపారమ్ మలేరియా వల్ల కలుగుతున్నాయి.

మలేరియా దోమకాటు ద్వారానే కాక రక్తమార్పిడి, తల్లిగర్భంలో తల్లి రక్తం ద్వారా గర్భస్థ శిశువుకు వ్యాప్తి చెందుతుంది.

జాగ్రత్తలు

1. జ్వరం రాగానే డాక్టర్‌ను సంప్రదించి తగు వైద్యం చేయించుకోవాలి.
2. ఇంటి కిటికీలకు, తలుపులకు దోమలు రాకుండా తెరలు పెట్టుకోవాలి.
3. సరిగ్గా దుస్తులు ధరించాలి.
4. దోమలను పారద్రోలే దోమల నివారణ బిళ్ళలు, కాయిల్స్ వాడాలి.
5. ప్రయాణీకులు ముఖ్యంగా మలేరియాలేని ప్రాంతాల నుంచి మలేరియా తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు, ఇతర దేశాలకు వెళ్ళే వారు ఆరోగ్య సంరక్షకుని సంప్రదించి మలేరియా నివారణ మందులను తీసుకొని వారి సూచన ప్రకారం వాడాలి. ఇంకా అవసరమైన ఇతర టీకాలు వేయించుకోవాలి.
6. డిడిటి లేక ఇతర క్రిమి సంహారక మందులను గదుల్లో, ఇతర అవసరమైన చోట్ల స్ప్రే చేయించాలి.

మలేరియా వ్యాధి వృద్ధి చెందురీతి :

ప్రారంభం : మనిషిలో మలేరియా ఎలా ప్రారంభం అవుతుందనగా – వ్యాధిగ్రస్థమైన ఒక ఆడ అనోఫిలిస్ దోమ తన ఆహారంగా మనిషిని కుట్టి రక్తాన్ని ఆహారంగా తీసుకునే సమయంలో తన లాలాజల గ్రంథుల్లోంచి ప్లాస్మోడియమ్ యొక్క స్పోరోజాయిట్స్‌ను మనిషి రక్తంలోనికి నేరుగా టీకా మార్గాన పంపుతుంది. ఈ అతిచిన్న మలేరియా పరాన్న జీవులు అతి త్వరగా రక్తప్రవాహంలో కలిసి కాలేయాన్ని చేరుకుంటాయి. మనిషి కాలేయపు (పారన్‌చైమల్) జీవకణాలపై దాడి చేసి అలింగ పునరుత్పత్తి కాలమును ప్రారంభిస్తాయి. అక్కడ ఒక్కో స్పోరోజాయిట్ అభివృద్ధి చెంది 10000 నుండి 30000 కంటే ఎక్కువగా మెరోజాయిట్ కూతుళ్ళను ఉత్పత్తి చేస్తాయి. దీనితో ఉబ్బిన కాలేయ జీవకణం పగిలిపోయి చలనం కలిగిన అనేక మెరోజాయిట్స్‌ను రక్తప్రవాహంలోకి పంపుతాయి. ఈ సమయమే జబ్బు లక్షణాల దశకు ప్రారంభ బిందువు. ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఒవేల్ రకం మలేరియాలలో కాలేయం చేరిన పరాన్న జీవులు వెంటనే విభజనను ప్రారంభించాక పునరుత్పత్తికి ముందు అనేక నెలలు లేక సంవత్సరాలు నిద్రాణ స్థితిలో వుంటాయి. ఈ నిద్రాణ రూపాలు లేక హైపోజాయిట్స్. ఈ రెండు రకాల మలేరియాలలో తిరిగి రావటానికి కారణం యాంటీబాడీల ఉత్పత్తితో కూడిన మలేరియా ప్రసారం. రక్తప్రవాహంలోనికి ప్రవేశించగానే మెరోజాయిట్స్ అత్యంత వేగంగా ఎర్రరక్త కణాలపై దాడి చేసి, వృద్ధి చెంది ట్రోఫోజాయిట్స్‌గా తయారవుతాయి. ఎర్రరక్తకణాల్లో అభివృద్ధి చెందుతున్న తరుణంలో మొదటి దశలో నాలుగు రకాల మలేరియాలలో సూక్ష్మదర్శిని పరీక్షలో చిన్న రింగ్ ఫామ్స్ ఉంగరం వంటి రూపాలు కనిపిస్తాయి. ట్రోఫోజాయిట్స్ పెద్దదైన కొద్దీ మలేరియాకారక పరాన్న జీవులు వాటి వాటి రూపాలను సంతరించుకుని క్రమములేని లేక అమీబా రూపాలను తెచ్చుకుంటాయి. 48 గంటలకల్లా (ప్లాస్మోడియం మలేరియాకు 72 గంటలు) ఎర్రరక్తకణంలోని హిమోగ్లోబిన్‌ను అంతా తినేసి పరాన్నజీవులు ఎర్రరక్తకణాన్ని అంతా ఆక్రమించుకుంటాయి. పలుమార్లు న్యూక్లియర్ విభజన జరిగి ఎర్రరక్త కణం పగిలిపోయి 6 నుండి 30 వరకు కూతురు మెరోజాయిట్స్ విడుదలవుతాయి. ఒక్కో మెరోజాయిట్ తిరిగి ఒక్కో నూతన ఎర్రరక్తకణంపైకి దాడి చేసి తిరిగి వృద్ధి చెందుతుంది. మానవుల్లో మలేరియా వ్యాధి పరాన్నజీవి ఎర్రరక్త కణంపై దాడి చేసి దానిని నాశనం చేయడం వల్ల కలిగిన ప్రభావం వల్ల, వాటికి మనిషి (అతిథి) యాంటిబాడీల ద్వారా జరిపే ప్రతి చర్య వల్ల కలుగుతుంది. అలా అలింగ ఉత్పత్తి అనేకసార్లు తిరిగి తిరిగి జరిగాక చివరకు కొన్ని పరాన్న జీవులు వృద్ధిచెంది కచ్చితమైన రూపం దిద్దుకుని ఎక్కువకాలం జీవించే లింగరూపాలను గామిటోసైట్సు పొందుతాయి. ఈ గామిటో సైట్సు మలేరియా వ్యాధిని మరొకరికి వాపింప చేయగలవు. అంటే ఈ గామిటో సైట్సును రక్తంలో కలిగి వున్న మనిషి రక్తాన్ని ఆడ అనోఫిలిస్ దోమ పీల్చినట్లయితే అవి దోమ శరీరంలోకి ప్రవేశిస్తాయి.

ఆడదోమ మనిషిని కాటు వేసి అతని రక్తాన్ని పీల్చడం వల్ల ఆ రక్తం ద్వారా తమ శరీరంలోకి ప్రవేశించిన మగ, ఆడ గామిటో సైట్సు ఆ (కీటకము) దోమ యొక్క జీర్ణకోశంలో ఫలదీకరణం చెంది అండంగా ఈ జైగోట్ తయారవుతాయి. ఈ జైగోట్సు వృద్ధి చెంది పరిపక్వతకు వచ్చి ఒక ఒకినేట్ వూఖినెట్‌గా మారుతుంది. ఈ వూఖినెట్ దోమ యొక్క జీర్ణకోశము యొక్క గోడలోకి చొచ్చుకుపోయి ఓసిస్ట్ పూసిస్టుగా మారిపోయి అక్కడ వుండిపోతుంది. దీని ఫలితంగా వచ్చి పూసిస్టు అలింగ విభజన ద్వారా వృద్ధి చెందడం వల్ల ఆ ఆడ అనోఫిలిస్ దోమ జీర్ణ కోశపు గోడ పగిలి అనేకమైన చలనం గల స్పోరో జాయిట్స్‌ను విడుదల చేస్తుంది. అవి హీమోలిఫ్‌లో స్థలాంతరం చెంది దోమ యొక్క లాలాజల గ్రంథులకు చేరుతాయి. ఇప్పుడు ఆ ఆడ అనాఫిలిస్ దోమ తదుపరి ఆహారం కోసం మరొక మనిషిని కాటువేసినపుడు, రక్తం పీల్చినపుడు స్పోరో జాయిట్స్‌ను ఆ మనిషికి టీకా మార్గాన ప్రవేశింపచేస్తుంది. ఇలా మలేరియా పరాన్న జీవి మనిషి, దోమ శరీరాల్లో ప్రవేశించి వృద్ధి చెందుతుంది. ఈ పరాన్న జీవుల జీవిత చక్రంలో గామిటోసైట్సు దశ నుండి తిరిగి స్పోరోజాయిట్స్ దశకు చేరుటకు 8 నుండి 30 రోజులు పడుతుంది. కనుక మలేరియా వ్యాప్తికి ఆ ఆడదోమ 7 రోజుల కన్నా ఎక్కువ కాలం జీవించాలి.

(తరువాయి భాగం వచ్చే వారం)

చేయకూడని పనులు

మలేరియా కేసుల చికిత్స నిర్వహణలో కొన్ని పనులు చేయరాదు.

1. మలేరియా చికిత్సకిచ్చే మందులను పరగడుపున ఇవ్వరాదు.
2. కార్టికో స్టీరాయిడ్స్‌ను ఇవ్వరాదు.
3. మానిటాల్ అనే మందును సిర ద్వారా ఇవ్వరాదు.
4. హెపారిన్ అను మందును రక్తం గడ్డకట్టకుండా వాడరాదు.
5. శరీరంలోనికి అతిగా నీటిని ప్రవేశింపచేయరాదు.

మానవ శరీరంలోని పరాన్న జీవులు ప్రవేశించగానే తయారయ్యే యాంటీబాడీలు – ప్రతిచర్యగా – వాటి తీరు ప్రత్యేకమైన ఎర్రరక్త కణపు ఉపరితలపు సెప్టాల్ ద్వారా మెరోజాయిట్స్ ఎర్రరక్తకణంతో కలుపుకుపోతాయి



శ్రీకారం

ఎన్నికల పోరాటం వేడెక్కుతున్న తరుణంలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీల ప్రచారార్భాటాలకు దీటుగా సిపిఎం రాష్ట్రకమిటీ పలు ప్రచార పుస్తకాలు రూపొందించింది. మంగళవారం నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిపిఎం విస్తృత సమావేశంలో ఈ పుస్తకాలను విడుదల చేశారు. ఈ ప్రచార పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీల్లో లభిస్తాయి.



బి.జెపి ఓటమితోనే భారత దేశానికి రక్ష

సిపిఎం ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ రచన. ఇందులో బిజెపి మతోన్మాద, నీతి బాహ్య రాజకీయాలను ఎండ గట్టారు. హైదరాబాదులో జరిగిన సిపిఎం కేంద్రకమిటీ సమావేశంలో రూపొందించిన ఎన్నికల కర్తవ్యాల ప్రాధాన్యతను, ఎన్నికల ప్రకటన తర్వాత బిజెపి బరితెగింపును సూర్జిత్ ఇందులో వివరించారు. ఈ పుస్తకం వెల: రు.5

ప్రపంచబ్యాంకు ఫర్మానాలు ప్రజా కంటక విధానాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు రచించిన ఈ పుస్తకంలో మొత్తం 120 పేజీలు న్నాయి. గత రెండు మూడేళ్ల కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిం చిన ప్రజావ్యతిరేక విధానాలు, వాటి వెనక ప్రపంచ బ్యాంకు ఆదేశాలు ఈ పుస్తకంలో సవివరంగా విశ్లేషించారు. 25 కు పైగా వున్న వ్యాసాలు బాబు-బ్యాంకు పాలన స్వరూపాన్ని సంపూర్ణంగా ఆవిష్కరిస్తాయి. వెల రు.20.



ధనస్వాములకు వెలుగులు దగాకోరు ప్రచారాలు

ప్రభుత్వ ప్రచారాల పూర్వరంగంలో ప్రముఖ ఆర్థిక వేత్తలు సిపిచంద్రశేఖర్ రాసిన " బద్దలవడానికి సిద్ధంగా వున్న బెలూన్", ఉత్సా పట్నాయక్ రాసిన" పతనావస్థలో గ్రామీణ భారతం"అనే వ్యాసాలు ఈ పుస్తకంలో వున్నాయి. వెల రు.3.

బూర్జువా లౌకిక వాదం మతతత్వ సవాలు

దేశ రాజకీయాలలో బిజెపి తిష్ట వేసిన పరిణామక్రమాన్ని ఎలా అర్థం చేసుకోవాలో సైద్ధాంతికంగా వివరించే ఈ రచన చేసింది పిఎంఎస్ గ్రేవల్. సిపిఎం సిద్ధాంత పత్రిక మార్క్సిస్టులో వచ్చిన పెద్ద వ్యాసానికి అనువాదం. మతోన్మాద ప్రమాదం పెరిగిన పరిస్థితులలో వామపక్షాలు అనుసరించ వలసిన ఎత్తుగడలు ఎలా వుండాలో బూర్జువా పార్టీల ఊగిసలాటలను, అవకాశవాదాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చెబుతుంది. ఐరోపాలో లౌకిక వ్యవస్థ స్థిరపడిన నాటి పరిస్థితులను, పరిమితులను కూడా చర్చిస్తుంది.నేటి ఎన్నికల పోరాటం రీత్యానే గాక వర్తమాన భారత రాజకీయాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడే అరుదైన అధ్యయనం ఇది. 24 పేజీలు, రు.5



అంతాబాగుంది అబద్ధాలు, ఆర్భాటాలు

పుస్తకం వెల- రు.6 పేజీలు 40.

ప్రముఖ పాత్రికేయులు ఎబికె ప్రసాద్ వ్యాసాల సంకలనం. బిజెపి గొప్పగా చెప్పుకుంటున్న అంతాబాగుంది ప్రచారం ఎంత బూటకమో ఇందులో ఎబికె వాస్తవాల ఆధారంగా చక్కగా ఎత్తిచూపుతారు.



ముందస్తు మాయలు (వీధినాటికలు, నృత్య రూపకాలు)

ప్రజానాట్య మండలి రూపొందించిన ఈ 64 పేజీల పుస్తకం వెల రు.6.మొత్తం 20 లఘు వీధి నాటి కలు (కిట్స్), నృత్య రూపకాలు దీనిలో వున్నాయి. అన్ని ప్రస్తుత పరిస్థితులను వ్యంగ్యంగా చెబుతాయి.

ఎన్నికల పాటలు, 2004

ప్రజానాట్యమండలి ఎన్నికల కోసం సంకలనం చేసిన పాటల పుస్తకం ఇది. మొత్తం 46 పేజీలు. వెల రు.8. జనరంజకమైన పలు పాటలు వున్నాయి.



శేషు

దక్షిణాపథాన బౌద్ధానికి ప్రాచుర్యం కల్పించిన ఆచార్య నాగార్జునుడు జన్మించిన జిల్లా గుంటూరు. ఈ జిల్లా పేరు చెప్పగానే గోంగూర పచ్చడి, చేనేత చీరలు, మంగళగిరి పానకాలస్వామి, మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయం, కోటప్పకొండ కోటేశ్వరుడు, అమరావతి, నాగార్జునసాగర్, ఉండవల్లి గుహలు తప్పక గుర్తువస్తాయి. గుంటూరు జిల్లాలో పర్యాటకులు చూడదగ్గ ప్రదేశాలు చాలా ఉన్నాయి.



ఉండవల్లి గుహలు

ఆచార్య నాగార్జునుడు బోధించిన చోటు...

నాగార్జునసాగర్

ఇంజనీరింగ్ అద్భుతానికి ప్రతీకగా కృష్ణా నదిపై నాగార్జునకొండ వద్ద నిర్మించిన బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నాగార్జునసాగర్ ఇరిగేషన్ అవసరాలకు, విద్యుత్ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ ప్రాజెక్ట్ గుంటూరు నగరానికి 150 కిలోమీటర్ల దూరాన ఉంది. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం జరిపిన తవ్వకాల్లో లభించిన బౌద్ధమత చిహ్నాలు, పరికరాలు, అనేకరకాల వస్తువులను సాగర్ నడుమ గల కొండపై మ్యూజియం నిర్మించి భద్రపరిచారు. ప్రాజెక్ట్ స్థలం నుండి నీటిలో ఫెర్రీ ద్వారా మ్యూజియం వరకు ప్రయాణించడం ఒక మధురానుభూతి.

సాగర్‌కు 12 కిలోమీటర్ల దూరాన కృష్ణా నది ఉపనది చంద్రవంకపై గల ఎత్తిపోతల దృశ్యం ఎంతో అద్భుతంగా ఉంటుంది. 70 అడుగులపై నుండి పడుతున్న జలపాతం వీక్షించాల్సిందే. ఇక్కడ మొసళ్ళ పెంపక కేంద్రం కూడా ఉంది.



నాగార్జునసాగర్

ఉండవల్లి గుహలు

కృష్ణా-గుంటూరు జిల్లాలను కలిపే ప్రకాశం బ్యారేజ్‌కి 5 కిలోమీటర్ల దూరంలో గల ఉండవల్లి గుహలు చాలా ప్రాచీనమైనవి. కొండల్లో చెక్కిన నాలుగంతస్థుల రాతి గుహలో అనేక దేవతారూపాలు కనిపిస్తాయి. ఇది బౌద్ధగుహ అయితే బౌద్ధం అవసానదశలో ఈ గుహల్లో చిత్రాలు, ప్రతిమలను వైష్ణవ దేవతామూర్తులుగా మార్చినట్లు చరిత్రకారులు చెబుతారు.

కారంపూడి

మాచెర్లకు 35 కిలోమీటర్ల దూరంలో గల కారంపూడి పల్నాటి వీరచరిత్రకు పురిటిగడ్డ. ఇక్కడ బ్రహ్మనాయుడు నిర్మించిన చెన్నకేశవ ఆలయానికి చారిత్రక నేపథ్యం ఉంది. పల్నాటి యుద్ధంలో వాడిన ఆయుధాలను ఈ ఆలయంలో భద్రపరిచారు. ఆనాటి యుద్ధంలో వీరమరణం పొందినవారిని స్మరిస్తూ ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు.

గుంటూరుకి 125 కిలోమీటర్ల దూరంలో గల మాచెర్లలోని చెన్నకేశవ ఆలయం హైహేయుల కాలంలో నిర్మించబడింది. పల్నాటిసీమలో ఇది కూడా ప్రసిద్ధి చెందినది. ఏటా ఇక్కడ నిర్వహించే ఉత్సవానికి దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు, పర్యాటకులు వస్తారు.

చేబ్రోలు

గుంటూరు నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో గల చేబ్రోలులో గల చతుర్ముఖ బ్రహ్మ ఆలయం దేశంలోనే అతి అరుదైనది. ఇక్కడకు పర్యాటకుల తాకిడి బాగా ఉంటుంది. రాష్ట్రంలో అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటైన భావన్నారాయణ పేరుతో ఏర్పడిన బాపట్ల గుంటూరుకు 53 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ బీచ్ కూడా ఉంది. గుంటూరుకు 5 కి.మీ. దూరంలో గల ఉప్పలపాడు లోని పక్షి సంరక్షణ కేంద్రానికి సైబీరియా నుండి వలసపక్షులు ఏటా వస్తాయి. సెప్టెంబర్ నుండి ఫిబ్రవరి వరకు దాదాపు 40రకాల వలస పక్షులు ఇక్కడ నివసిస్తాయి.

కొండవీడు

గుంటూరు నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో గల కొండవీడులో చారిత్రక రెడ్డిరాజులు నిర్మించిన కోట ఉంది. వెయ్యేళ్ళ క్రితం నిర్మించిన ఈ కోట ప్రస్తుతం శిధిలావస్థలో ఉంది. ఇక్కడ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. గుంటూరు నగరానికి 63 కిలోమీటర్ల దూరంలోని కోటప్పకొండపై ఉన్న ప్రాచీన శివాలయం ఎంత ప్రసిద్ధి పొందింది. మహాశివరాత్రి సందర్భంగా ప్రతిఏటా ఇక్కడ భారీఎత్తున ఉత్సవాలు జరుగుతాయి.

అమరావతి

తెలుగునేలపై బౌద్ధాన్ని ప్రచారం చేసిన శాతవాహనుల రాజధాని ధాన్యకటకం లేదా ధరణికోట ఆధునిక రూపమే అమరావతి. ఈ పట్టణం గుంటూరుకి 35 కిలోమీటర్ల దూరంలో కృష్ణా తీరాన ఉంది. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దం నుండి క్రీస్తుశకం రెండవ శతాబ్దం వరకు ఈ పట్టణం శాతవాహనుల రాజధానిగా ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో బౌద్ధ మతానికి చెందిన అనేక వస్తువులు, పరికరాలు, ఆరామాలు లభ్యమయ్యాయి. అక్కడే మ్యూజియం నిర్మించి అందులో వాటన్నింటినీ భద్రపరిచారు. కృష్ణ ఒడ్డున గల అమరలింగేశ్వర దేవాలయం శివరాత్రి వేళల్లో భక్తులు, పర్యాటకులతో ఎంతో సందడిగా ఉంటుంది.

విజయవాడకు 12 కిలోమీటర్ల దూరంలో గల మంగళగిరి పానకాలస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి. ఇక్కడి కొండపై లక్ష్మీనరసింహాలయం ఉంది. కొండలో తొలచిన ఆలయంలో దేవుని విగ్రహం నోటిలో నిరంతరం పానకం పోస్తారు. అందువల్లే ఈ దేవుడికి పానకాలస్వామి అని పేరువచ్చింది. ఆలయం దిగువన గల గాలిగోపురాన్ని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారు. ఈ పట్టణం చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి చెందింది. ★

పిట్టకొంచెం - బొమ్మలు ఘనం

లలితకళల్లో అతి ముఖ్యమైనది చిత్రకళ. పిల్లల అభిరుచులకు తగ్గట్టుగా తల్లిదండ్రులు ప్రోత్సహించగల్గితే ఆయా రంగాల్లో వారు అద్భుతాలు సృష్టించి మంచి కళాకారులవుతారు. అందుకు నిదర్శనం చిత్రకళలో అద్భుతమైన కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న తొమ్మిదేళ్ళ బి. మాధురీ భావన! గుంటూరుకు చెందిన ప్రతిమా సంస్థవారు గత జనవరిలో నిర్వహించిన 7వ జాతీయ యువ చిత్రకారుల చిత్రకళా పోటీలో తను చిత్రించిన ప్రపంచశాంతి పెయింటింగ్‌కు "బాలకళా రత్న" అవార్డుకు ఎంపికయింది. విశాఖ ఉక్కు నగరం, డిపాల్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న మాధురీభావనకు "బాల కళారత్న" అవార్డుతో సత్కరించారు.

ఇటీవల అమలాపురంకు చెందిన కొరపాల "వండర్ ఆర్ట్ విలేజ్" వారు నిర్వహించిన అఖిలభారత బాలల చిత్రకళా పోటీలలో ఈ చిన్నారి స్వర్ణపతకాన్ని గెలుచుకుంది. మాధురి ప్రతిభను గుర్తిస్తూ పెప్సీ కంపెనీ వారు "వండర్ కిడ్" అవార్డుతోనూ, స్టీల్ ప్లాంట్ ఆఫీసర్స్ క్లబ్ వారు "చైల్డ్ .....-2002" అవార్డుతో సన్మానించగా, 2001లో సీతా మ్యూజిక్ అకాడమి మరియు కూరెళ్ళ సోమేశ్వరరావు ట్రస్ట్ వారు 'బాలమేధావి' అవార్డుతోను, కోకోకోలా వారు 'సూపర్ కిడ్' అవార్డుతోను కేంద్రీయ విద్యాలయం స్టీల్‌ప్లాంట్ అవుట్ స్టాండింగ్' అవార్డుతోనూ సత్కరించారు.

మాధురి తండ్రి బి.గోవర్ధన్‌రెడ్డి విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉన్నత స్థాయి అధికారిగా పని చేస్తున్నారు. ప్రోత్సాహంతో 5వ ఏటనే చిత్రకళను ప్రారంభించి, వివిధ స్థాయిల చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని పలు అవార్డులు పొందగలిగిన మాధురికి అవంతిక న్యాఫిలీవారు నిర్వహించిన అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీల్లో 2002,2003లలో స్వర్ణపతకం

మన్యం వీరులం - సత్తా చూపిస్తాం

తరతరాలుగా కొండల్లో
బతుకుతున్న గిరిజనులం
పాలకపక్షాల నిర్లక్ష్యానికి
గురవుతున్న జనాలం
తింటానికి బువ్వ కరువు
ఉంటానికి గూడు కరువు
విన్నపాలు వినిపించుకోని
అధికారులతో విసిగెత్తిపోయాం
ఖాళీ స్థలంలో పాకలు వేసుకున్నాం
అప్పటి వరకూ నిద్రపోయిన యంత్రాంగం
ఆ స్థలం ప్రభుత్వానిదంది
మమ్మల్ని ఆక్రమణదారులంది
పోలీసుల్ని మాపై ఉసిగొల్పింది
నిజాలు తొక్కిపెట్టి...
అమాయకులపై తుపాకులు ఎక్కుపెట్టే
కర్కశ ఖాకీల లాఠీ మాపై లేచింది!
పోలీసుల' దమన కాండ' సాగింది!!
ఇదేంటని ప్రశ్నించిన మా నాయకుల్ని
గొలుసులతో కట్టారు
లాఠీలతో కొట్టారు
జైళ్లలో పెట్టారు
పాలకపక్షాల చేతిలో కీలుబొమ్మల్లా
పనిచేసే పోలీసులు...
ప్రజాస్వామ్యాన్ని నాడాల బూట్లకింద
తొక్కిపెట్టారు!
కడుపు మండే పేదోళ్ల నుంచి పుట్టిన
ఉద్యమాన్ని
లాఠీలు, తుపాకులు ఆపలేవు!
ఉద్యమ స్ఫూర్తి నిండిన గుండెల్లో
ధైర్యాన్ని సడలించలేవు !!
ఆదరిస్తే అమాయక గిరిజనులం
రెచ్చగొడితే 'అల్లూరి'లవుతాం
మన్యం వీరుల సత్తా చూపిస్తాం !

\- ఆర్కే

మరియు కాంస్య పతకం లభించగా. 2001లో కొరసాల వండర్ ఆర్ట్ వరల్డ్, అమలాపురం–హైదరాబాద్ వారు 5వ అంతర్జాతీయ పోటీలో 'బాలచిత్రరత్న' అవార్డు లభించింది.

జాతీయస్థాయి చిత్ర లేఖనం పోటీలో 2005లో యంగ్ ఇన్‌వాయిన్ అసోసియేషన్–హైదరాబాద్ వారి నుంచి ప్రతిష్టాకరమైన నెహ్రూకల్చర్ అవార్డు" అభించగా, శంక–పశ్చిమబెంగాల్ వారు నిర్వహించిన పోటీలోనూ, లలితకళా పరిషత్, విశాఖ వారు. నిర్వహించిన పోటీల్లోను రజిత పతకాలు లభించాయి. 2002లో లలితకళా పరిషత్–విశాఖ వారి నుండి రజిత పతకం, 2001లో సంస్కృతి–హైదరాబాద్ నిర్వహించిన పోటీలో "సంస్కృతి పురస్కార్" అవార్డుతో పాటు వివిధ సంస్థలు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో 20 వరకు ప్రత్యేక బహుమతులు పొందగా, జిల్లా స్థాయిల్లో మూడు, సిటీ, స్థాయిలో 15, విద్యాలయస్థాయిలో 4 వరకు అవార్డులు లభించాయి.



కేంద్రీయ విద్యాలయం, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, బేగంపేట ఆర్ట్ టీచర్ బి. శశిభూషణరావు ప్రత్యేక శిక్షణలో మాధురి రెండు పర్యాయాలు సోలో చిత్రకళా ప్రదర్శనను ఇవ్వటమే కాక 5 సార్లు వివిధ సంస్థలు నిర్వహించిన చిత్రకళా వర్క్‌షాపుల్లో పాల్గొని, 3 సార్లు గ్రూపు చిత్రకళా ప్రదర్శనలో పాల్గొన్నది.

మాధురి చిత్రకళ ప్రదర్శనలను 2001లో కోకోకోలా వారు స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేయగా, 2002లో పెప్సీ కంపెనీవారు విశాఖ మ్యూజియంలో ప్రదర్శించారు. పెడిలైట్ ఇండస్ట్రీస్, ఫెవికాల్ ఇండస్ట్రీస్– బొంబాయి వారు నిర్వహించిన పెయింటింగ్ వర్క్‌షాపులో మూడు సార్లు, హాబీ క్లాసుల్లో 2 పర్యాయాలు పాల్గొన్న మాధురి పిన్సిల్ స్కేల్‌ను 250 వరకు, పోస్టర్ గ్రీటింగ్స్ 250, పోస్టర్ పెయింటింగ్స్ 300 వరకు చిత్రించి పలు చిత్రకళాభిమానులు, ప్రముఖుల ప్రశంసలను అందుకుంది. ★

అర్హత

జన్మాంధుడైనా
ఒంటరితనం గూడులో
ధిగులు పిట్టలా
విషాదగీతం కానక్కరలేదు
జీవితానికి వసంతం
రంగులద్దడానికి
వరమాలతో ఒప్పిస్తారు గాంధారిని
– –
సంసారాలు, సరాగాలు త్యజించి
మోహాలు, వ్యామోహాలు వర్జించి
వంటి మీద వల్మీక వస్త్రాలు
ధరించిన
సంయమీంద్రుడితోనైనా
సప్తపదులు నడవడానికి
సిద్ధం చేస్తారు సుకుమారి సుకన్యను
– – –
సామ్రాజ్యాలు నశించి
వనాంతర సీమల
కందమూలాలు భుజిస్తూ
తాపసవృత్తి స్వీకరించినా
పాణీగ్రహణం చేయడానికి
వధువు పాత్రలో ఒదిగిస్తారు
రాకుమార్తె సావిత్రిని
– –
నిగమశర్మ ఐనా
అష్టావక్రుడైనా
అంగుళీమాలుడైనా
ఈ దేశంలో
వరుడు కావడానికి
ఒక పురుషుడిగా జన్మిస్తే చాలు...!

– మందరపు హైమవతి



న్యాయసలహాలు

ADVOCATE

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

న్యాయపరమైన చర్యకు అవకాశం ఉందా?

ఇటీవల పోస్టల్ వారు వినియోగదారులకు వచ్చే లెటర్సు, బుక్స్‌పైన వివిధ వాణిజ్య ప్రకటనలు గల స్టిక్కర్స్ అంటిస్తున్నారు. దానివలన వినియోగదారులకు వచ్చే పత్రికల ముఖచిత్రాలపై మాయని మచ్చలా ఉంటున్నాయి. నిబంధనలు, ఇంగ్లీషు, హిందీ తెలియని ఒక గ్రామీణుడు పోస్టుకార్డుపై అడ్రస్‌కి కిందుగా 1, 2 లైన్స్ మేటర్ రాయడం జరిగింది. దానికి పోస్టల్ వారు 1 రూ. పెనాల్టీ వసూలు చేశారు. డిసెంబర్ 31 ఐక్యఉపాధ్యాయ, విద్యావిషయక మాసపత్రిక ముఖచిత్రం చెన్నుపాటి లక్ష్మయ్య గారిది కడు రమణీయంగా ఉంది. అయితే మాయని మచ్చలాగా దానిపై ఒక వాణిజ్యపరమైన స్టిక్కర్ అంటించారు. చాలా బాధ, పోస్టల్ వారిపై కోపం వచ్చింది. ఇటువంటి సందర్భాలలో పోస్టల్ వారిపై చట్టపరంగా చర్యకు అవకాశం ఉందా? తెలపగలరు.

– జి.ఎన్.ప్రసాదరావు, పాలకొల్లు, ప.గో.జిల్లా

గ్లోబలైజేషన్ పేరుతో ప్రస్తుతం అంతా ప్రయివేటు పరమవుతోంది. ప్రయివేటు సంస్థలు ఎప్పుడూ ప్రతీదాన్ని లాభంతోనే ముడిపెడతాయి గాని సేవ గురించి ఆలోచించవు. మన ప్రభుత్వాలు కూడా ఈ రోజుల్లో వాణిజ్యపరంగానే ఆలోచిస్తున్నాయి. దానికి నిదర్శనాలు ఎన్నో వున్నాయి. దాంట్లో ఆర్.టి.సి. బస్సులపై కూడా వాణిజ్య ప్రకటనలు వగైరా. దాంట్లో ఇప్పుడు మీరు చెబుతున్నది కూడా ఒకటి. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా... పెనాల్టీలు అంతే

మీరు మాయని మచ్చగా వున్న స్టిక్కరు మీద న్యాయపరమైన చర్య అంటే అది బహుశా మీకు ఒక్కరికే జరిగిందా లేదా అన్న కాపీలపై అలాగే జరిగిందా! దాంతో మీరు పొందిన మనస్థాపం, ఆ వ్యక్తి పేరుకు జరిగిన నష్టం ఇవ్వన్నీ వివరిస్తూ మీరు కన్సూమర్ ఫోరమ్‌ని ఆశ్రయించాల్సి ఉంటుంది. సేవల్లో జరిగిన నష్టాన్ని మీరు రుజువు చేసే దాన్ని బట్టి ఫలితం ఉంటుంది.

తీర్పు ఉన్నా పర్మినెంట్ చేయలేదు

నేను ఫారెస్టు డిపార్టుమెంట్‌లో ఎన్.ఎమ్.ఆర్.గా గత తేది. 01-11-1993 నుండి ఇప్పటి వరకు కంటిన్యూస్‌సర్వీస్‌తో పని చేయుచున్నాను. నేను, మరికొంతమంది ఎన్.ఎమ్.ఆర్.లు 2000 సంవత్సరంలో ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించాము. కొద్దికాలం తరువాత హైకోర్టు జి.ఓ.నెం.212 తేది 22-4.1994 అనుసరించి 1993 సంవత్సరమునకు ముందు 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి వారిని, 01-11-1993 నాటికి ఉండి తరువాత (5) సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారిని పర్మినెంట్ చెయ్యమని ది.23.2.2001న బహిరంగ తీర్పు ఇచ్చినది. కాని మమల్ని ఇంతవరకు పర్మినెంట్ చేసి ఉండలేదు. మేము ఏంచెయ్యాలో తగిన సలహా ఇవ్వగలరని కోరుతున్నాము.

– కె.శ్రీరామచంద్రమూర్తి, కన్నాపురం, ప.గో.జిల్లా

శ్రీరామచంద్రమూర్తిగారు మీరు చెబుతున్న కోర్టు తీర్పు మీరు వేసిన మీకు సంబంధించిన ట్రిబ్యునల్ కేసా లేక హైకోర్టు మిగతా వారి కేసుల్లో జి.ఓ.ఎమ్.ఎస్.నెం.212 గురించి ఇచ్చిన తీర్పా అన్నది స్పష్టంగా చెప్పలేకపోయారు. రెండూ కలిపి చెబుతున్నారు. కాని హైకోర్టు మాత్రం జి.ఓ.ఎమ్.ఎస్.నెం.212లో సింగిల్ జడ్జి గారు అందరికీ ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని తీర్పు చెప్పారు. కాని ఇద్దరు జడ్జిల ధర్మాసనం అర్హతలున్న వారందరికీ ఉద్యోగాలివ్వమని చెప్పలేదు. కచ్చితమైన ఖాళీలు ఉండి, ప్రభుత్వం భర్తీ చేయవలసిందని అనుమతినిచ్చిన పోస్టుల వరకే ఉద్యోగాలివ్వమని తీర్పు చెప్పింది. మీ విషయంలో ఖాళీ ఉండి, అనుమతి మంజూరు అయి వున్నదా? లేదా అనేది తెలుపలేదు. అలా అనుమతి ఉంటేనే మీకు ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది.

హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఆ తీర్పు వచ్చే వరకు మీకు ఏ న్యాయం జరగక పోవచ్చు. 1980-85 సంవత్సరం నుండి ఎన్.ఎమ్.ఆర్.లుగా చేస్తున్న వారు కూడా చాలా మంది ఉన్నారు. వారి కేసులే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో వున్నవి.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు

ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

రుచి

కావలసిన వస్తువులు :

గోధుమ పిండి	:	పావు కిలో
పచ్చి శనగపప్పు	:	పావు కిలో
బెల్లం	:	పావు కిలో
పచ్చికొబ్బరి	:	ఒక చిప్ప
ఏలకులు	:	10
నూనె	:	అర కిలో

గోధుమ పిండితో పూర్ణాలు

తయారు చేసే విధానం:

పచ్చి శనగపప్పు రాళ్ళు లేకుండా చేసుకోవాలి. బెల్లం తరగాలి. ఏలకులను పొడి కొట్టుకొని ఉంచుకోవాలి. పచ్చికొబ్బరి తురమాలి. గోధుమ పిండి జల్లించుకోవాలి. పచ్చి శనగపప్పును రెండు గంటలు నానబెట్టి నీళ్ళన్నీ ఒంపేసి కుక్కర్‌లో ఉడక బెట్టాలి. ఉడికిన తరువాత పప్పును బాగా ఆరనివ్వాలి. తరువాత రోట్లోగానీ, మిక్సీలోగాని వేసి మెత్తగా తయారు చేసి అందులో తురిమిన బెల్లం కలపాలి. చివరగా కొబ్బరి, ఏలకుల పొడిని కలపాలి. ఈ పిండి ముద్దకు రాకపోతే అందులోని తేమ పోయే వరకు పొయ్యిమీద పెట్టి అడుగంటకుండా తిప్పాలి. తరువాత దానిని మనకు కావలసిన సైజులో ఉండలు చేసుకోవాలి. గోధుమ పిండిలో నీళ్ళు పోసి కొంచెం ఉప్పు వేసి జారుగా కలుపుకోవాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. కాగిన తరువాత పూర్ణం ముద్దను గోధుమ పిండిలో ముంచి నూనెలో వేయాలి. కాలిన తరువాత తీసి వేయాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి.

గమనిక

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ రకాల వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తి ఆదివారం అనుబంధం రుచి పేజీలో ప్రచురిస్తాము. వంటకం ఫొటోతో పాటు రాసిన వారి ఫొటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా:
రుచి, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి, అశోకనగర్,
స్ట్రీట్ నెం:1 హైదరాబాద్ 20



పచ్చి మామిడి కాయలతో షర్బత్

కావలసిన వస్తువులు :

పచ్చి మామిడికాయ రసం	:	ఒక గ్లాసు
పంచదార	:	మూడు గ్లాసులు
ఉప్పు	:	ఒక స్పూను
నీరు	:	అర గ్లాసు

తయారు చేసే విధానం :

మామిడి కాయలు శుభ్రంగా కడిగి చెక్కు తీయాలి. ముక్కలు కోసుకోవాలి. ఒక స్పూను ఉప్పువేసి ముక్కలు మిక్సీలో గ్రైండ్ చేయాలి. ఈ రసం పలుచని బట్టలో వడకట్టాలి. పంచదారలో నీళ్ళుపోసి పాకం పట్టాలి. ఈ రసం కూడా కలపాలి. అందుబాటులో ఉంటే అర స్పూను మ్యాంగో ఎసెన్స్ కలపాలి. తరువాత దించి వేయాలి. ఆరిన తరువాత సీసాలో పోసుకోవాలి. ఒక గ్లాసు నీళ్ళలో ఈ రసం రెండు స్పూన్లు వేసి కొద్దిగా ఐస్ వేసుకొని తాగాలి. లేదా చల్లని నీటితో ఈ రసం వేసుకొని తాగితే పుల్లగా, తియ్యగా బాగుంటుంది.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది